

హైలెవల్ ఛానల్‌లో గుర్రపుడెక్క

- అధ్వానంగా సాగునీటి కాల్వలు
- నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- డెల్టా పరిధిలోని కాల్వలకు స్వల్పకాలిక టెండర్లు
- ప్రతిపాదనల దశ దాటని సాగర్ కుడి కాల్వల బాగు

మరమ్మతులు జరిగేనా?

సాగునీరు పారాల్సిన కాల్వలు.. తూటికాడ, జమ్ము, రబ్బరు మొక్కలతో నిండిపోయాయి. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చివరి భూములకు సాగునీరు అందించాల్సిన కాల్వలు పూడికతో నిండిపోయాయి. సాగునీటి కాల్వల కట్టలు కోతకు గురై ఉన్నాయి. సాగునీరు సక్రమంగా అందక పంటలు ఎండిపోతున్నా పాలకులకు పట్టలేదు. ఐదేళ్లు అటు వర్షాభావం.. ఇటు అరకొర ఉన్న సాగునీరు కాల్వల ద్వారా సక్రమంగా అందక రైతులు అల్లాడిపోయారు. అయినా పాలకులు కాల్వల మరమ్మతుల గురించి పట్టించుకోలేదు.. రైతుల గోడు ఆలకించలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వంలో అయినా సాగునీటి కాల్వల బాగుపై దృష్టి సారిస్తారని రైతులు ఆశిస్తున్నారు. ఖరీఫ్‌కు సాగునీటి ఇబ్బందులు లేకుండా కనీసం తాత్కాలిక మరమ్మతులు తక్షణం చేయాలని రైతులు కోరుతున్నారు.



కొమ్మమూరు కాల్వలో కోతపడిన కట్ట వెంట వేసిన ఇసుక మూటలు



బాపట్ల జమ్ముల పాలెం తూర్పు డ్రైన్‌లో పెరిగిపోయిన గుర్రపు డెక్క

గతంలో పనులు చేయకుండానే దోచేశారు

ఖరీఫ్ సీజన్ వస్తుందంటే మూడు నెలల ముందు నుంచి డెల్టా కాల్వల మరమ్మతులు, అత్యవసర మరమ్మతులు పూర్తిచేసే పనిలో నీటిపారుదల శాఖ తలమునకలై ఉండేది. కానీ గత నాలుగు సీజన్లలో ఒక్కపని కూడా లేదు. ప్రభుత్వం రైతుల కోసం కేటాయిస్తానన్న నిధుల మాట అటుంచితే, అత్యవసర పనులు చెయ్యాల్సిన తరుణంలోనూ మొండిచెయి చూపుతూ వచ్చింది. గతంలో సాగునీటి కాల్వల మరమ్మతుల కోసం సాధారణ నిధులు, ప్రత్యేక మరమ్మతుల కోసం నిధులను ప్రభుత్వం విడుదల చేసేది. ఇవేకాక ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్(ఓఅండ్‌ఎం) కింద కూడా కొన్ని నిధులు మంజూరు చేసేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక అవన్నీ పోయి చివరకు ఓఅండ్‌ఎం నిధులే దిక్కయ్యాయి. అవికూడా విదిలింపులే ఉండటంతో పనులు జరిగిన పరిస్థితి లేదు. ఆ కొద్దిపాటి నిధులను కూడా కాల్వలు ఖాళీగా ఉన్నప్పుడు కాకుండా, కాల్వలకు నీరు వదిలే సమయంలో విడుదల చేసి, హడావిడి చేసినట్లు చూపించి, చివరకు వాటిలో 80 శాతం నిధులు ఆ పార్టీ నేతలే కాంట్రాక్టర్‌లుగా అవతారమెత్తి దోచేసిన సందర్భాలున్నాయి. గత ఖరీఫ్ సీజన్‌లోనూ రూ.22 కోట్లు ప్రభుత్వం ఓఅండ్‌ఎం కింద మంజూరు చేస్తే, వాటిలో తూటుకాడ తొలగింపు, పూడికతీత పేరుతో మొత్తం దోచేశారు.

రూ.22.54 కోట్ల ప్రతిపాదనలతో సరి

నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో మేజర్లు, మైనర్లు, సబ్ మైనర్ కాల్వలు అధ్వానస్థితికి చేరుకున్నాయి. డ్రాపులు పగిలిపోయాయి. షట్టర్లు కూడా దెబ్బ తిన్నాయి, చాలా మైనర్లకు నీటిని సరఫరా చేసే తూ ములకు కనీసం షట్టర్లు కూడా లేవు. దీంతో నీటి సర ఫరాలో నియంత్రణ ఉండటంలేదు. సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. మరమ్మతులకు జలవ నరుల శాఖ రూ.22.54 కోట్లతో ప్రతిపాదనలు పంపింది. మరమ్మతులు తప్పనిసరి అయినా ప్రభుత్వం నిధులు విడుదల ఊసెత్తకపోతుండటంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినుకొండ, లింగంగుంట్ల, సత్తెనపల్లి డివిజన్లలో అత్యవసర మరమ్మతులకు సంబంధించి 473 పనులను గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ22.54 కోట్లు వ్యయం అంచనా వేశారు. ఈ పనులపై ఇటీవల మంత్రి నిమ్మల సమీక్షించినా నేటి వరకు నిధులు కేటాయింపులు లేవు.





పల్నాడులో కాల్వలు కనిపించనంతగా పెరిగిన కంప చెట్లు

బాపట్ల, తెనాలి, నరసరావుపేట జూలై 26 (ఆంధ్రజ్యోతి): దెబ్బతినిపోయి గండ్లు పడటానికి సిద్ధంగా ఉన్న కాల్వ కట్టలు. కాల్వల్లో సాగునీరు కిందికి పోకుండా కమ్మేసిన గుర్రపుడెక్క. షట్టర్లకు రంధ్రాలు పడి, చెక్కలు అడ్డుపెట్టినా వృథాగా పోతున్న సాగు నీరు. ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఉన్న సాగునీటి కాల్వలు, డ్రెయిన్ల దుస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో ఈ ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు చివరి భూములకు చేరడం కష్టమే. నీటి విడుదల ఆలస్యమైనా, నీరు చివరి వరకు చేరకున్నా పంట దిగుబడులపై ప్రభావం చూపే పరిస్థితి. అయినా నాటి పాలకులు సాగునీటి వ్యవస్థ గురించి కనీసంగా కూడా ఆలోచించలేదంటే ఆశ్చర్యం కాదు. డెల్టా పరిధిలో గత నాలుగు సీజన్లలో ఒక్క పనికూడా జరిగిన దాఖలాలే లేవు. దీంతో సాగునీటి కష్టాలు మరింత పెరిగిపోయాయి. చుక్కనీరు చివరి భూమి వరకు వెళ్లాలంటే ఒక ప్రహసనమే. కేవలం చిల్లర విదిలింపులతో అప్పటి వైసీపీ సర్కారు సరిపెట్టింది. దీంతో ఒక్క గండీ పూడ్చలేని పరిస్థితి. కాల్వ కట్టలు దెబ్బతినిపోయినా, గండ్లు పడినా, చివరి భూములకు నీరు అందకపోయినా అడిగే దిక్కేలేదు. అప్పట్లో ఓఅండ్‌ఎం నిధులే దిక్కు. అవికూడా ప్రతిపాదనలు పంపినంత కాకుండా వారికి తోచినంత ఇచ్చి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. సాగునీరు చివరి భూముల వరకు అందాలంటే కాల్వలే కీలకం. అయితే ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ కాల్వలు గత నాలుగేళ్లుగా అధ్వానంగా మారిపోయాయి. పట్టించుకునే దిక్కులేక, దెబ్బతిన్న కట్టలను బాగుచేసేవారులేక, షట్టర్లు తుప్పు పట్టిపోయిన పరిస్థితి. ఇక కాల్వల్లో నీరు ప్రవహించడానికి దారిలేదన్నట్టు పిచ్చిచెట్లు, ముళ్ల కంపలు, తూటుకాడ, గుర్రపు డెక్క పెరిగిపోయి అడ్డుగా మారిపోయాయి. ప్రస్తుతం ఆశాజనకంగా వర్షాలు పడుతున్నాయి. జలాశయాలకు పుష్కలంగా నీరు వస్తోంది. ఈ పరిస్థితుల్లో సాగునీటి కాల్వల మరమ్మతుల విషయంలో దేనినీ ఆలస్యం చేయడానికి వీలులేదు. మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేసేందుకు ప్రభుత్వం సత్వరం చర్యలు తీసుకోవాలి. ఐదేళ్లుగా సాగర్ పరిధిలోని కాల్వల్లో పూడిక తీత నోచుకోలేదు. కూటమి ప్రభుత్వంలో ఇటీవల మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్షించగా.. పనులు నిర్వహణ ప్రతిపాదనలకే పరిమితమైంది. నిధుల విడుదలపై నేటి వరకు ఎటువంటి ప్రకటన వెలువడలేదు. ఈ ఏడాదికి కాలువలకు మరమ్మతులు లేనట్లేనన్న అభిప్రాయం అధికారుల నుంచి వ్యక్తమవు తోంది. కాలువలు బాగు చేయకపోతే సాగునీటి పారుదలకు ఇబ్బందులు ఏర్పడతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక కృష్ణా పశ్చిమ డెల్టా కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం ఇటీవల రూ.13.62 కోట్లు మంజూరు చేసింది. అయితే అటు పట్టిసీమ నీరు, ఇటు వర్షాలతో ప్రస్తుతం కాల్వల్లో నీరు పుష్కలంగా పారుదల అవుతుంది. దీంతో కాల్వల మరమ్మతులకు ఇబ్బందులు తప్పడంలేదు. కాల్వలకు సకాలంలో నీరొచ్చిందన్న ఆనందం కాల్వల ఎగువ భూముల రైతులకుంటే, చివరి భూముల రైతులు మాత్రం నీరు అందని పరిస్థితుల్లో మరమ్మతులు జరిగితే బాగుంటుందని ఎదురు చూస్తున్న పరిస్థితి.

డెల్టాలో పనులపై సందిగ్ధత

కృష్ణా పశ్చిమ డెల్టాలో అత్యవసర మరమ్మతుల కోసం ఈ సీజన్‌కు ప్రభుత్వం రూ.13.62 కోట్లు మంజూరు చేసింది. వీటితో డెల్టా కాల్వలు, డ్రెయిన్లలో అత్యవసరమనుకున్న 188 పనులు పూర్తి చేసేందుకు నీటిపారుదల శాఖ సన్నద్ధమయింది. కృష్ణా పశ్చిమ విభాగం పరిధిలో 85 పనుల కోసం రూ.4.98 కోట్లు, రేపల్లె, చీరాల డ్రెయినేజీ డివిజన్‌ల పరిధిలో 98 పనులకు రూ.7.3 కోట్లు, గుంటూరు వాహిని కింద 5 పనుల కోసం రూ.1.31 కోట్లు కేటాయించారు. అయితే ఇప్పటికే కాల్వలకు నీరొచ్చేయటం, డెల్టాలో వరి సాగు వెద పద్ధతిలో మొదలవడంతో పనులు ఆచరణలో ఎంతవరకు సకాలంలో పూర్తవుతాయనేదే సందేహంగా మారింది. నీటిపారుదల శాఖ అధికారులు పనులను చిన్నవిగా విభజించి, స్వల్పకాలిక టెండర్లను పిలిచింది. అయితే కాంట్రాక్టర్ల మధ్య ఒప్పందం పూర్తై, వారు పనులు మొదలుపెట్టడానికి ఇంకా పక్షం రోజులు పట్టే పరిస్థితి. ఈ తరుణంలో పనులు సాగేతీరుపై సందిగ్ధత నెలకొంది.

కౌలు కష్టాలు.. తీరినట్లేనా..?

- వార్షిక రుణ పద్దులో రుణాలకు పెద్దపీట
- ఐదేళ్లుగా సర్దుబాటుకే ప్రాధాన్యమిచ్చిన గత ప్రభుత్వం
- కౌలు రైతులకు కూటమి ప్రభుత్వం రూ.200 కోట్ల రుణాలు

బాపట్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు రుణ కష్టాలు తీరనున్నాయా.. అంటే అవునని కూటమి ప్రభుత్వం చెప్తోంది. ప్రధానంగా పంటల సాగు చేసే వారిలో కౌలు రైతులే అధికం. అయితే సాగు వ్యయం కోసం వడ్డీ వ్యాపారులను కౌలు రైతులు ఆశ్రయించాల్సి వస్తున్నది. ప్రభుత్వం నుంచి రాయితీలు, సబ్సిడీలు, లబ్ధి భూ యజమానులు పొందుతుండగా వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు కష్టాలు, నష్టాలు, అప్పులు మిగులుతున్నాయి. చివరకు పంటల సాగుకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణాలను కూడా కౌలు రైతులు పొందలేకపోతున్నారు. కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కౌలు రాయితీ కార్డులు(సీసీఆర్) కూడా దక్కక పోవడంతో బ్యాంకుల నుంచి రుణాలు కూడా సక్రమంగా పొందలేకపోతున్నారు. గత ప్రభుత్వం కౌలు రైతుల సమస్యలపై దృష్టి సారించకపోవడంతో ఐదేళ్లు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో అప్పుల పాలై పలువురు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో వేల కోట్ల వ్యవసాయ రుణాల పద్దును బ్యాంకర్ల సమక్షంలో ప్రభుత్వం ఘనంగా ప్రకటించడం.. తర్వాత అన్నదాతలకు రుణాలను సర్దుబాటు చేసి వాటినే రుణాలుగా ఇచ్చినట్లు గొప్పగా ప్రకటించుకోవడం పరిపాటిగా జరిగింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో బ్యాంకు రుణాల విషయంలో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ప్రకటించిన వార్షిక రుణ పద్దులో వ్యవసాయం వాటి అనుబంధ రుణాలకు పెద్దపీట వేసింది. అదేవిధంగా గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో కౌలు రైతులకే రూ.200 కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. రుణాల విషయంలో బ్యాంకులు ఉదారంగా ఉండాలని ప్రభుత్వం బ్యాంకర్లకు సూచించింది. గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న ఇబ్బందులు ఈ దఫా ఎట్టిపరిస్థితుల్లోనూ ఉండకూడదని స్పష్టమైన మార్గదర్శకాలను ప్రభుత్వం ఇచ్చింది. ఈ క్రమంలో తాజా వార్షిక పద్దులో ప్రకటించిన వేల కోట్ల రుణాలు ఈ సారైనా రైతులకు అంది వారి అధిక వడ్డీ కష్టాలు తీరి బలవన్మరణాలు తగ్గుతాయనే ఆకాంక్ష సర్వత్రా వ్యక్తమవుతోంది.



పొలం దున్నుతున్న రైతు

వ్యవసాయ రుణాలు రూ.10,053 కోట్లు

2024-25 ఆర్థిక సంవత్సరానికి పంట రుణాలతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు అన్నింటికి కలిపి రూ.10,053 కోట్లు అందించాలని వార్షికపద్దులో ప్రకటించారు. దీనిలో ఖరీఫ్, రబీ రెండు సీజన్లు కలిసే ఉన్నాయి ఖరీఫ్‌కు పంట రుణాలు రూ.3,750 కోట్లను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిలో ఇప్పటి వరకు రూ.1850 కోట్లను అందించగా, వ్యవసాయ అనుబంధ సేవలకి కలిపి ఇప్పటికే రూ.3,250 కోట్లను రుణాలుగా ఇచ్చినట్లు బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. రబీ సీజన్‌కు వచ్చేసరికి రూ.2,592 కోట్లను రుణాలను అందించాలని వార్షికపద్దులో పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే వ్యవసాయ రుణాలలో 15 శాతం వృద్ధి నమోదవడం రైతులపై ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా కనబడుతోంది.

కౌలు రైతులకే రూ.200 కోట్లు

ఈ సారి ఒక్క కౌలు రైతుల రుణ వాటానే రూ.200 కోట్లకు ప్రభుత్వం పెంచేసింది. దీనికి తగ్గట్టే సీసీఆర్‌సీ కార్డుల విషయంలో కూడా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ కౌలు రైతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధను ప్రభుత్వం కనబరుస్తోంది. గడచిన ఐదేళ్ల కలిసి వైసీపీ ప్రభుత్వం కౌలు రైతులకు అందించిన రుణాలు రూ.150 కోట్ల లోపే కావడం గమనార్హం. వాస్తవానికి పంట రుణాల మొత్తం పద్దులో 5 శాతం కౌలు రైతులకు రుణాలుగా అందించాలన్నది ప్రభుత్వాల ఉద్దేశం. దీనిని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. కౌలు రైతులకు తీవ్ర అన్యాయం చేయడమే కాకుండా వారి ఆత్మహత్యలకు కారణమైంది. ఐదేళ్లలో కౌలు రైతులకు జరిగిన అన్యాయాన్ని సరిచేసే క్రమంలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.200 కోట్ల రుణాలను వారికి అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు

సర్దుబాట్లకే ప్రాధాన్యం..


వైసీపీ ప్రభుత్వంలో వార్షికపద్దులో అందించే రుణాలను పెద్దమొత్తంలో చూపి ఆచరణలోకి వచ్చేసరికి సర్దుబాటుకే మొగ్గుచూపి రైతులను వంచించింది. రుణాల విషయంలో బ్యాంకుల ఎదుట రైతులు ధర్నాకు దిగిన ఉదంతాలను గతంలో చూశాము. ప్రకటించిన పద్దులో 70 శాతం రుణాలను సర్దుబాటు చేసి వాటిని కూడా రుణాలు ఇచ్చినట్లు చూపి లక్ష్యాలను వందశాతం చేరుకున్నామనే ఆర్భాటపు ప్రకటనలను వైసీపీ చేసేది. ప్రస్తుత వార్షిక పద్దులో నేరుగా రుణాలను రైతులకు అందించడంపై శ్రద్ధపెట్టాలని, అన్నదాతలు స్వచ్ఛందంగా సర్దుబాటుకు ఇష్టపడితే తప్ప రుణాలు ఇవ్వడానికే బ్యాంకర్లు ప్రయత్నించాలనే ఆదేశాలను ప్రభుత్వం ఇవ్వడం ఈ సారి పద్దులో అన్నదాతలకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగిస్తోంది. గత ప్రభుత్వం ప్రకటించిన రుణాల కన్నా ఈ సారి వార్షిక పద్దులో వ్యవసాయ అనుబంధ రంగాల వాటా పెరగడంతో పాటు వాటిని అందించే విషయంలో స్పష్టమైన ఆదేశాలను ప్రభుత్వం ఇవ్వడంతో ఈ సారి తమకు అధిక వడ్డీల బెడద తప్పుతుందనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కౌలు రైతులు అయితే మరింత ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

వడివడిగా.. కృష్ణమ్మ

- శ్రీశైలానికి పోటెత్తుతున్న వరద
- అంతకంతకు పెరుగుతున్న వరద
- సాగర్ జలాశయానికి నీటి విడుదల
- కుడి కాల్వ ఆయకట్టుకు సాగునీటి భరోసా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణమ్మ వడివడిగా వస్తోంది. శ్రీశైలం దిశగా పరుగులు పెడుతూ వస్తోంది. దీంతో అంతకంతకు జలాశయానికి వరద నీరు పోటెత్తుతోంది. దాదాపు 2.46 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోంది. ఇది క్రమంగా మూడు లక్షల క్యూసెక్కులు దాటే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీశైలానికి 10 రోజుల వరకు వరద ప్రవాహం కొనసాగుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. ఇప్పటికే 110 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నాగార్జునసాగర్ జలాశయానికి శుక్రవారం నీటిని విడుదల చేశారు. నాలుగు రోజుల్లో సాగర్ జలాశయానికి కూడా భారీగానే వరద నీరు వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో కుడికాల్వ ఆయకట్టుకు సాగునీటి భరోసా వస్తోంది. గత ఏడాది వరి సాగు కోల్పోయిన రైతుల్లో ఈ ఏడాది ఆశలు చిగురిస్తున్నాయి. కృష్ణానది పరివాహక ప్రాంతంలో గత రెండు రోజుల్లో 600 మీమీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ ప్రకటించింది. దీంతో ఆల్‌మట్టి, తుంగభద్ర జలాశయాలకు వరద నీటి ప్రవాహం పెరగనున్నది. ఇప్పటికే శ్రీశైలం ఎగువ ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీటి నిల్వ చేరింది. దీంతో ఆయా జలాశయాలకు వస్తున్న వరదనీటిని దిగువకు వదిలేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి వరద నీరు రెండు రోజుల్లో రానున్నది. నారాయణపూర్ జలాశయానికి వస్తున్న నీటిని అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తం 3.12 లక్షల కూసెక్కుల నీరు శ్రీశైలానికి రానున్నది. శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తూ సాగర్‌కు 30,784 క్యూసెక్కుల నీరు వస్తున్నది. తాగునీటి అవసరాలకు కుడి కాల్వకు సాగర్ నుంచి 6,990 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



శ్రీశైలం జలాశయానికి జలకళ

జలాశయాల్లో నీటి నిల్వల వివరాలు...

జలాశయం	పూర్తి స్థాయి నీటి నిల్వ టీఎంసీలలో	ప్రస్తుత నిల్వ టీఎంసీలలో	వస్తున్న వరద నీరు క్యూసెక్కుల్లో	విడుదల చేస్తున్న నీరు క్యూసెక్కుల్లో
ఆల్మట్టి	123.08	83.48	2,04,098	2,66,586
నారాయణపూర్	33.31	26.85	2,61,397	2,65,494
జూరాల	9.66	5.99	2,24,083	2,26,375
తుంగభద్ర	105.78	96.25	87,766	84,149
శ్రీశైలం	215.81	110.47	2,46,965	31,784
నాగార్జున సాగర్	312.05	123.34	29,589	6,990
పులిచింతల	45.77	1.03	276	50

తీరప్రాంతాల అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ వెంకట మురళీ



బాపట్ల, జూలై 26: సీఆర్‌జెడ్(కోస్టల్ రెగ్యూలేషన్ జోన్) తీరప్రాంతాలు, ప్రాదేశిక నీటి పరిమితి ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. సీఆర్‌జెడ్ 2019 నోటిఫికేషన్ అమలు కొరకు ప్రజాభిప్రాయ సేకరణ శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకుంటూనే తీరప్రాంతాలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన మడ అడువులు, వాగులు, ఇసుక దిన్నెలను దెబ్బతీయకుండానే అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 492 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ ఏర్పాటు కానుందన్నారు. పర్యాటకులు, సందర్శకులు విరివిగా రావడానికి సీఆర్‌జెడ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సీఆర్‌జెడ్‌లో అభివృద్ధిలేని ప్రాంతాల విస్తీర్ణం కుదించాలని రిసార్ట్స్ యాజమానులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆయా గ్రామాల ప్రజలు కోరారు. సమావేశంలో జేసీ బి.సుబ్బారావు, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ రాఘవరెడ్డి, శాస్త్రవేత్తలు కె.సౌందర్‌రాజన్, ఆర్.సమనిధి, ఏపీసీజెడ్ ఎంఎ మీరా, షేక్.సుభానీ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ కళాశాలల్లో బీఈ/బీటెక్ లేటరల్ ఎంట్రీ

దిక్సూచి
DIKSUCHI

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ)- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. యూనివర్సిటీ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజ్ సహా వర్సిటీ అనుబంధ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రతి కళాశాలలో స్పెషలైజేషన్‌కు 30 సీట్లు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఈ ప్రోగ్రామ్‌లకు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు ఉంటాయి. వారాంతాలు, సెలవు రోజుల్లో కూడా అందరి సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని క్లాసెస్ నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000. వర్సిటీ నిబంధనల మేరకు ఇతర ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.



అర్హత: ఏదేని గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. చేరదలచుకున్న ఇంజనీరింగ్ కాలేజీకి 100 కి.మీ.ల పరిధిలో ఉన్న కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు, ఎంఎస్ఎంఈ పరిశ్రమలు/సంస్థల్లో పని చేస్తూ ఉండాలి. కనీసం ఏడాది అనుభవం తప్పనిసరి.

ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో స్పెషలైజేషన్‌కు సంబంధించి మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 36 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 15 శాతం మార్కులు రావాలి. పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 27
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** డిప్లొమా సర్టిఫికెట్-మార్కుల పత్రాలు, టీసీ, మైగ్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, పదోతరగతి సర్టిఫికెట్, ఆరోతరగతి నుంచి డిప్లొమా వరకు స్టడీ సర్టిఫికెట్లు, సర్వీస్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, జిరాక్స్ కాపీలు, రెండు ఫొటోలు.
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** ఆగస్టు 4
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 8
- **మొదటి ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 17
- **రెండో ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 24
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/7kP3x2Cలో చదవండి.

కోటక్ కన్య స్కాలర్‌షిప్

కోటక్ మహీంద్రా గ్రూప్ కంపెనీలు, కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'కోటక్ కన్య స్కాలర్‌షిప్ 2024-25' నోటిఫికేషన్ వెలువడింది. ప్రతిభావంతులైన బాలికలను ఉన్నత విద్యలో ప్రోత్సహిస్తూ వారికి ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కాలర్‌షిప్‌ను ఉద్దేశించారు. కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండో తరగతి పూర్తిచేసి గుర్తింపు పొందిన కాలేజీల్లో ఇంజనీరింగ్/మెడిసిన్/బీడీఎస్/ఫార్మసీ/ఆర్కిటెక్చర్/డిజైనింగ్ విభాగాల్లో డిగ్రీ ప్రవేశం పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ, బీఎస్సీ నర్సింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరినవారు; బెంగళూరు ఐఐఎస్సీ, ఐసర్ సంస్థల నుంచి ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్ అడ్మిషన్ పొందినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.6 లక్షలు మించకూడదు. ఎంపికైన బాలికలకు ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ఇంటర్నెట్, ల్యాప్‌టాప్, బుక్స్, స్టేషనరీ ఖర్చుల కింద ఏడాదికి రూ.లక్షన్నర ఇస్తారు. వార్షిక పరీక్షల్లో కనీసం 6 సీజీపీఏ సాధించేవారికి కోర్సు పూర్తయ్యేవరకూ స్కాలర్‌షిప్ కొనసాగిస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **వెబ్‌సైట్:** www.kotak.com, www.b4s.in/it/kkgs2

పోటీ నీకే - జయం నీదే

కొత్త పుస్తకం

పోటీ పరీక్షలు అంటే గ్రామీణ యువతలో విపరీతమైన క్రేజ్ ఉంటుంది. అయితే వీరిలో ఎక్కువ మంది గ్రూప్స్, టీచర్ వంటి ఉద్యోగాల పట్ల దృష్టిపెడతారు కానీ సివిల్స్ గురించి ఆలోచించరు. రాయాలని ఉన్నా అవి పెద్ద పెద్ద పట్టణాల్లో చదువుకున్నవారికి లేదా టాప్ ర్యాంకర్లకు ఉద్దేశించిన ఉద్యోగాలని భావిస్తుంటారు. అలాంటి వారికి మార్గనిర్దేశం చేసేందుకు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రావులపాటి సీతారామారావు 'పోటీ నీకే - జయం నీదే' పేరుతో పుస్తకం రాశారు.

ఏదో పనిమీద బయటకు వెళ్లినప్పుడు తనను కలిసిన విద్యార్థులు, ఉద్యోగార్థులు పలు సందేహాలు వెలిబుచ్చేవారు. తను వారికి ఇచ్చిన గైడెన్స్ అందరికీ చేరాలనే ఉద్దేశంతో రచయిత ఈ పుస్తకం రాశారు.

విజయం సాధించాలంటే పెద్ద బ్యాక్‌గ్రౌండ్ ఉండాల్సిన పనిలేదు. ఒక గమ్యాన్ని నిర్దేశించుకుని, దాని కోసం క్రమపద్ధతిలో కష్టపడాలని చెబుతారు. పోటీ పరీక్షల కోసం ప్లానింగ్ ఎలా చేసుకోవాలి? ఎన్ని గంటలు చదవాలి? పరీక్షల కోసం సిద్ధమయ్యే వారికి మెంటార్ అవసరమా? అని చెబుతూ తనతో సహా గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు సివిల్స్ వంటి పరీక్షల్లో ఎలా విజయం సాధించారో స్ఫూర్తి కలిగించేలా సవివరంగా చెప్పారు సీతారామారావు. పరీక్షలు రాసే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని అధిగమించిన తీరును పుస్తకంలో వివరించారు.

పరీక్షలకు సిద్ధంకావడానికి ముందే అకడమిక్ పరీక్షలకు, పోటీ పరీక్షలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంగా గ్రహించగలగాలి. చదువుకోవడానికి మూడ్ ఉండాలి, వారం-వర్జ్యం లాంటివి చూసుకోవాలనే మూఢనమ్మకాలు దరిచేరనీయ వద్దు. లక్ష్యం పెద్దగా నిర్ణయించుకున్నప్పుడు అందుకు అనుగుణంగానే ప్రిపేర్ కావాలి అని చెబుతారు. సెల్ఫ్ మోటివేషన్ పొందడానికి ఏమి చేయాలి? కొంత మంది సివిల్స్ అభ్యర్థులు ఎలా మోటివేట్ అయ్యారు అని వివరించారు. ఇవి సివిల్స్ అభ్యర్థులకు మాత్రమే కాకుండా అన్ని పరీక్షల విద్యార్థులకు ఉపయోగపడతాయి. ఈ పుస్తకాన్ని సాహితి ప్రచురణలు వారు ప్రింట్ చేశారు.

వెల: రూ.90/-

ప్రతులకు: సాహితి ప్రచురణలు 33-22-2, చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్.రోడ్, చుట్టుగుంట, విజయవాడ-520 002.

ఫోన్: 8121098500



నవ్య | చిత్రజ్యోతి

ఆ పాటలో కేసీఆర్‌ను తలుచుకున్నామంతే!



రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోని 'మార్ ముంతా ఛోడ్ చింతా' పాట వివాదంపై సంగీత దర్శకుడు మణిశర్మ స్పందించారు. ఆ పాటలో 'ఇప్పుడేం చేద్దాం' అంటూ కేసీఆర్ అన్న మాటను ఉపయోగించడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహించాయి. ఇటీవల ఇచ్చిన ఈ పాట గురించి ఇచ్చిన వీడియో ఇంటర్వ్యూలో మణిశర్మ వివరణ ఇస్తూ 'సోషల్ మీడియాలో వచ్చే మీమ్స్ ఆధారంగా ఆ పాట ఉంటుంది. కేసీఆర్ అంటే అందరికీ గౌరవం. ఆయన సరదాగా చెప్పిన ఓ పదాన్ని ఇందులో తీసుకున్నామంతే. ఎవరినీ నొప్పించడం మా ఉద్దేశం కాదు. నా 27 ఏళ్ల కెరీర్‌లో ఎవరినీ నొప్పించలేదు. ఆ పాటలో కేసీఆర్‌ను ఒకసారి తలచుకున్నాం. కేవలం అది వినోదం కోసమే. దయచేసి అందరూ అలాగే భావించండి' అన్నారు. 'డబుల్ ఇస్మార్ట్' లోని మూడో పాట 'క్యా లఫ్డా' ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన రామ్, హీరోయిన్ కావ్యా థాపర్ పోస్టర్ రొమాంటిక్‌గా ఉంది. ఆగస్టు 15న 'డబుల్ ఇస్మార్ట్' విడుదల కానుంది.

మనవడి స్కూలుకు రజనీ



పాఠశాలకు వెళ్లేందుకు మారాం చేసిన తన మనవడిని తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ స్వయంగా స్కూల్‌కు తీసుకెళ్ళి వదిలిపెట్టారు. మనవడితో కారులో రజనీ స్కూల్‌కు వెళుతున్న ఫోటోను ఆయన చిన్న కుమార్తె సౌందర్య శుక్రవారం సామాజికా మాధ్యమాల్లో షేర్ చేస్తూ.. 'ఈ రోజు నా కుమారుడు స్కూల్‌కు వెళ్ళనని మొండికేయడంతో వాడి సూపర్ హీరో తాత (రజనీ) పాఠశాలకు స్వయంగా తీసుకెళ్లారు. వెండితెర అయినా, నిజజీవితంలో అయినా ఎలాంటి పాత్రనైనా నా తండ్రి అద్భుతంగా పూర్తి చేస్తారు' అని పేర్కొన్నారు. కాగా, సౌందర్య కుమారుడు వేద్‌ను పాఠశాల తరగతి గదిలోకి తీసుకెళ్ళిన రజనీకాంత్‌ను ఇతర పిల్లలు సంభ్రమాశ్చర్యాలతో చూశారు. వెండితెరవేల్పు రజనీ తమ కళ్లముందు ప్రత్యక్షమవ్వడంతో వారి ఆనందానికి హద్దే లేకుండాపోయింది. ఇదిలావుంటే, 'వేట్టయాన్' సినిమా పూర్తి చేసిన రజనీకాంత్ ఇపుడు లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌లో గ్యాప్ లభించడంతో ప్రస్తుతం ఆయన స్థానిక పోయెస్ గార్డెన్‌లో ఉన్న తన నివాసంలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి, (చెన్నై)

షారుక్ ఖాన్ రూ.40 కోట్లు.. అమితాబ్ రూ.30 కోట్లు...

అనంత్ అంబానీపై సినీ సెలెబ్రిటీల కానుకల వర్షం...



ఆభరణాల సెట్

అమితాబ్ బచ్చన్ దంపతులు, అభిషేక్, ఐశ్వర్య కలసి ఈ వధూవరులకి రూ.30 కోట్ల విలువైన ఆభరణాల సెట్‌ను (పచ్చల హారాన్ని) బహుమతిగా ఇచ్చారు.



ఇటీవలే అంగరంగ వైభవంగా జరిగిన అనంత్ అంబానీ, రాధిక మర్చంట్‌ల వివాహం.. ప్రపంచవ్యాప్తంగా జరిగిన అత్యంత ఖరీదైన పెళ్లిల్లో ఒకటిగా నిలిచిపోయింది. ఈ చిరకాల వేడుకకు అంబానీ కుటుంబం చేసిన హంగామాని ప్రజలు కలకాలం గుర్తుంచుకుంటారు. ఆకాశంలో చంద్రుడు చుట్టూ ఉన్న అసంఖ్యాక తారల్లా.. అంబానీ పెళ్లిలో అనేక రంగాల్లోని అగ్ర తారలందరూ సందడి చేసి దేదీప్యమానంగా వెలుగులు విరబూశారు. ఈ విలాసవంతమైన పెళ్లికి అదిరిపోయే రేంజ్‌లో అత్యున్నతమైన ఏర్పాట్లకు తోడు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ తారలు హాజరవడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకకు వచ్చిన కొందరికి అంబానీ కుటుంబం అతిథి మర్యాదలతో దాదాపు రూ.రెండు కోట్ల విలువ చేసే వాచీలను గిఫ్ట్‌గా ఇచ్చారు. అలాగే సినీ సెలబ్రిటీలు కూడా ఈ కొత్త జంటకు కానుకలు అందించడానికి క్యూ కట్టడం విశేషం. మిగతా పరిశ్రమల నటీనటులు ఏయే బహుమతులు ఇచ్చారో తెలియదు కానీ.. బాలీవుడ్ తారలు ఇచ్చిన బహుమతుల వివరాలు ఒక్కొక్కటే బయటకు వస్తున్నాయి. ఎవరు ఏమేమిచ్చారో ఇప్పుడు తెలుసుకుందాం.



రూ.40 కోట్ల విల్లా

బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ ఈ నూతన జంటకు ఫ్రాన్స్‌లో రూ.40 కోట్లు ఖరీదు చేసే ఓ విలాసవంతమైన భవంతిని కానుకగా ఇచ్చారు.



రూ.20 కోట్ల రోల్స్ రాయిస్

'కల్కి 2898 ఏ.డీ'తో తెలుగువారికి చేరువైన దీపికా పదుకొనే, తన భర్త రణ్‌వీర్ రూ.20 కోట్లు పెట్టి ఓ రోల్స్ రాయిస్ కారును వెడ్డింగ్ ప్రజంటేషన్‌గా ఇచ్చారు.



రూ.15 కోట్ల బైక్

సల్మాన్ ఖాన్ రూ.15 కోట్ల విలువైన స్పోర్ట్స్ బైక్‌ను కానుకగా ఇచ్చారు.

రూ.తొమ్మిది కోట్ల మెర్సిడెస్

రణ్‌బీర్ కపూర్, అలియా భట్ జంట ఈ కపుల్‌కు రూ.తొమ్మిది కోట్ల విలువైన మెర్సిడెస్ కారును గిఫ్ట్‌గా ఇచ్చారు.









వీరితో పాటు, అక్షయ్ కుమార్ రూ.60 లక్షలు విలువ చేసే బంగారపు పెన్నును.. సిద్ధార్థ్ మల్హోత్రా, కియారా అద్వానీ దంపతులు రూ.25 లక్షలు విలువ చేసే హ్యాండ్ మేడ్ శాలువాను.. విక్కీకౌశల్, కత్రినా కైఫ్ దంపతులు రూ.19 లక్షల బంగారు గొలుసును బహూకరించారు.

మూడేళ్ల కష్టం.. కమిటీ కుర్రోళ్లు



అంతా కొత్తవారితో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ట్రైలర్‌ను శుక్రవారం హీరో సిద్దు జొన్నలగడ్డ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చిన్న సినిమా, పెద్ద సినిమా అని ఉండదు. ఓ సినిమాకు ఎక్కువ ఖర్చు పెడతాం, మరో చిత్రానికి తక్కువ ఖర్చు పెడతాం.. తేడా అంతే. ఈ సినిమాలో విజువల్స్ బాగున్నాయి. కొత్తవారితో ఇంత మంచి చిత్రం తీయడం మామూలు విషయం కాదు. దర్శకుడు యదు వంశీకి ఇదే మొదటి సినిమా అంటే నమ్మబుద్ధి కావడం లేదు. ఈ సినిమా హిట్ అయి అందరికీ లాభాలు తేవాలి' అని కోరారు. చిత్ర సమర్పకురాలు నిహారిక మాట్లాడుతూ 'మూడేళ్ల కష్టం ఈ సినిమా. వీరంతా మూడేళ్లుగా పని చేస్తునే ఉన్నారు. అంతా కష్టపడి మంచి సినిమా చేశాం. ఆగస్టు 9న సినిమాను విడుదల చేస్తున్నాం' అని చెప్పారు. 'మా సినిమాలో నటించిన 11 మంది సిద్ధులాగా ఎంతో కష్టపడుతుంటారు. మా టెక్నికల్ టీమ్ సపోర్ట్‌తో సినిమాను బాగా తీయగలిగాను. నిహారిక, ఫణి లేకపోతే చిత్రం ఇలా వచ్చేదే కాదు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేశ్ సహకారం మరువలేనిది' అని చెప్పారు దర్శకుడు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తీసిన యూత్‌ఫుల్ మూవీ ఇదని నిర్మాత ఫణి అడపాక, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేశ్ చెప్పారు.

సస్పెన్స్ థ్రిల్లర్




కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా నటించిన చిత్రం 'జ్యూయల్ థీఫ్' సీనియర్ నటి ప్రేమ కీలక పాత్ర పోషించారు. పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మించారు. ఇటీవలే సినిమా టీజర్‌ని, ఆడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'నేను సూపర్‌స్టార్ కృష్ణగారి అభిమానిని. ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. ఈ తరం ప్రేక్షకులకు నచ్చే సస్పెన్స్ థ్రిల్లర్. త్వరలోనే విడుదల చేస్తాం' అని చెప్పారు.

'పావలా' శ్యామలకు సాయి దుర్గతేజ్ ఆర్థిక సాయం



ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న సీనియర్ నటి 'పావలా' శ్యామలకు హీరో సాయి దుర్గతేజ్ ఆర్థిక సాయం చేశారు.. తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యుల ద్వారా శ్యామలకు లక్ష రూపాయలు పంపించారు. శ్యామల ఎమోషనల్ అయి 'మా అమ్మాయికి ఆపరేషన్ అయినప్పుడు సాయి దుర్గతేజ్ ఫోన్ చేసి, ధైర్యం చెప్పారు. వచ్చి కలుస్తానన్నారు. చాలా రోజులైంది. మరిచిపోయారేమో అనుకున్నా. గుర్తు పెట్టుకుని సాయం చేసినందుకు ధన్యవాదాలు' అన్నారు.

వాణిజ్య హంగులతో విరాజి



వరుణ్ సందేశ్ కథానాయకుడిగా ఆద్యంత్ హర్ష తెరకెక్కించిన చిత్రం 'విరాజి'. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మీడియాతో ముచ్చటించారు. 'గతంలో మా సంస్థలో వరలక్ష్మి శరత్‌కుమార్‌తో 'శబరి' చిత్రాన్ని నిర్మించాం. మేం నిర్మించిన రెండో చిత్రం 'విరాజి'. వరుణ్ సందేశ్ కొత్తలుక్‌లో కనిపిస్తారు. ఆయన గెటప్‌కు కథలో ప్రాధాన్యం ఉంది. మన సమాజంలోని ఒక అంశాన్ని తీసుకొని కమర్షియల్ కోణంలో సినిమాను తెరకెక్కించాం' అని మహేంద్రనాథ్ చెప్పారు.

విద్యార్థులకు వసతి సదుపాయం కల్పించాలి

● కేంద్ర మంత్రి మురుగన్‌ను కోరిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



కేంద్ర మంత్రి మురుగన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

మాచర్లటౌన్, జూలై 26: మాచర్లలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో విద్యార్థులకు వసతిగృహం కల్పించాలని, పట్టణంలో ఖాళీగా ఉన్న భారత ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని భవనం లీజుకు అనుమతి ఇవ్వాలని కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్‌ను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి మురుగన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. హాస్టల్ సౌకర్యం కోసం ప్రభుత్వ భవనం లేకపోవడంతో వసతిగృహాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పట్టణంలోని వివిధ కళాశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన నిరుపేద బాలికలు విద్యనభ్యసిస్తున్నారని, వారికి భవనాల కొరత తీవ్రంగా ఉందని వివరించారు. మాచర్ల పట్టణంలో భారత ప్రసార మంత్రిత్వ శాఖ సిబ్బంది కోసం ఇరవై గదులతో భవనాన్ని నిర్మించిందని, అవి ఉపయోగంలో లేవని, ఆ భవనాన్ని లీజుకు ఇచ్చేందుకు అనుమతులు ఇవ్వాలని ఎంపీ కోరారు.

ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

పొన్నూరుటౌన్, జూలై 26: ఈ నెల 31వ తేదీ నుంచి పొన్నూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి డిప్లమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తునట్లు చెప్పారు, 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో జరిగే స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావలసినదిగా సూచించారు.

శక్తివంతమైన భారత్ కోసం కార్గిల్ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

గుంటూరు ఎమ్మెల్యేల పిలుపు



కార్గిల్ ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి, సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, హాజరైన కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్‌లు

గుంటూరు సిటీ, జూలై 26: 2047 నాటికి దేశాన్ని గొప్ప శక్తివంతమైన దేశంగా మార్చేందుకు, కార్గిల్ యుద్ధంలో సాధించిన చిరస్మరణీయ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని గుంటూరు ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన మూడు రోజుల కార్గిల్ విజయ్‌దివస్ రజతోత్సవ ఫొటో ఎగ్జిబిషన్‌లో సమావేశమైన కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్‌లను ఉద్దేశించి వారు ప్రసంగించారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఏర్పాటుచేసిన ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన తర్వాత గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ 2047 నాటికి అభివృద్ధి పరంగా భారత్‌ను ప్రపంచంలో అగ్రస్థానానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకోవాలని కోరారు. యువత చిత్తశుద్ధితో కృషి చేస్తేనే ఉజ్వల లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. దేశం శాంతియుతంగా ఉండేందుకు సైనికులు ఎన్నో త్యాగాలు చేశారని ఆమె అన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు జీవిత పరీక్షల్లో విజయం సాధించేందుకు సన్నద్ధతను కొనసాగించాలన్నారు. చారిత్రక సంఘటనలు భవిష్యత్తు తరాలకు కొన్ని పాఠాలను మిగులుస్తాయన్నారు. విజయంలో క్రమశిక్షణ, సంసిద్ధత కీలకమని చెప్పారు. ఎమ్మెల్యేలు ఇద్దరూ ఎగ్జిబిషన్‌లో కార్గిల్ యుద్ధానికి సంబంధించిన వివిధ చిత్రాల వివరాలను తెలుసుకున్నారు. ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్ 1999లో అధిక ఎత్తులో జరిగిన కార్గిల్‌యుద్ధంలో సైన్యం ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారు. భారతదేశం తన ఆయుధాలను, యుద్ధ వ్యూహాలను ఆధునీకరించి తిరుగులేని శక్తిగా ఎదిగిందన్నారు.

పీఐబీ, సీబీసీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజిందర్‌చౌదరి సరైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడానికి సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చేపట్టిన వివిధ కార్యకలాపాలను వివరించారు. సవాళ్లను ఆత్మవిశ్వాసంతో స్వీకరించి, ఫలితాలను వినయంతో స్వీకరించాలని విద్యార్థులను చైతన్యపరిచారు. దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించడంలో సైనికులు చేసిన అత్యున్నత త్యాగాలను స్మరించుకునేందుకు సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సీబీసీ, అందరికీ అందుబాటులో ఉండేలా మూడు రోజుల ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వివిధ కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు దేశభక్తి నినాదాలతో ర్యాలీకి నాయకత్వం వహించగా, సీబీసీ ఫీల్డ్ ఆఫీసర్ ఆర్ రమేష్‌చంద్ర, ఎన్‌సీసీ అధికారి విజయ్ మోహితే జెండా ఊపి ప్రారంభించారు. సీబీసీ వివిధ కళాశాలల్లో కార్గిల్ విజయదివస్ సిల్వర్ జూబ్లీ థీమ్‌పై వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, డ్రాయింగ్ పోటీలను కూడా నిర్వహించింది.

దేవదాయశాఖ భూముల్లో నివాసముంటున్న పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

● పెదకాకాని మండలంలో ఎన్టీఆర్, ఏవీఎన్ కాలనీలో సుదీర్ఘకాలంగా నివాసం ఉంటున్న పేదలు

● అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల



అసెంబ్లీ సమావేశాల్లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదకాకాని, జూలై 26: దేవదాయశాఖ భూముల్లో నివాసముంటున్న పేదలకు ఇళ్లస్థలాలు మంజూరుచేయాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని పెదకాకాని మండలంలో ఎన్టీఆర్, ఏవీఎన్ కాలనీలో ఉన్నాయని తెలిపారు. ఎన్టీఆర్ కాలనీ పెదకాకానిలోని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంకు చెందిన భూమిని, ఏవీఎన్ కాలనీ ప్రకాశం జిల్లాలోని అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంకు చెందిన భూమి ఉందని తెలిపారు. ఈ రెండు కాలనీలు దేవదాయశాఖకు చెందినవి అని, అందులో సుమారు 30, 40 సంవత్సరాలు నుండి పేదలు ఇళ్ల నిర్మాణం చేపట్టి నివాసం ఉంటున్నారు. పేదలకు తగు న్యాయం చేయాలని కోరారు. ఆ రెండు కాలనీలలో గ్రామపంచాయతీ తరపున వీధిలైట్లు, తాగునీరు, డ్రైనేజీ, అంగన్‌వాడీ కేంద్రాల వంటి అనేక మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. ప్రస్తుతం ఆ కాలనీలను తొలగించడం సాధ్యం కాదని, వారికి న్యాయం చేయాలన్నారు. ఆయా కాలనీలలో నివాసం ఉంటున్న పేదలకు ఒక రేటు నిర్ణయించి, వారికే ఇళ్లస్థలాలు మంజూరుచేయాలని కోరారు. ఆ దిశగా రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక జీవోని తీసుకొచ్చి రెవెన్యూలో నిషేధిత భూములను, పొలాలను పెద్దఎత్తున కాజేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో పేదలకు ఏమాత్రం న్యాయం జరగలేదని, ప్రభుత్వ పెద్దలు గద్దల్లాగా దోచుకున్నారన్నారు.

డేటా ప్రాసెసింగ్‌పై విస్తృత పరిశోధనలు అవసరం

● వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, జూలై 26: మన దేశం డేటా ప్రాసెసింగ్‌పై చేస్తున్న విస్తృత పరిశోధనలు మరింత వేగవంతం కావాలని ఏఎన్‌యూ ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ కే గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆనాల్గమేషన్ ఆఫ్ నావిగేషన్ ఎర్త్ అబ్జర్వేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీస్ అనే అంశంపై సాంకేతిక సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా వీసీ ప్రొఫెసర్ గంగాధరరావు మాట్లాడారు. ప్రపంచం మొత్తం డేటా ప్రాసెసింగ్‌పై పరిశోధనలు చేస్తున్నాయని, మన దేశం టెక్స్‌టైల్, మ్యానుఫ్యాక్చరింగ్, ఎస్వీపీ, జీపీయూ ప్రాసెసర్, మ్యానుఫ్యాక్చరింగ్ మీద దృష్టి సారించిందని అన్నారు. గణితశాస్త్ర నైపుణ్యం అందరూ పెంచుకోవాలని సూచించారు. సెమినార్ డైరెక్టర్ ఆచార్య పి.సిద్దయ్య మాట్లాడుతూ సాంకేతికతలను మెరుగుపరిచి సమ్మేళనం చేయడం ద్వారా ఒక ఆచరణార్థమైన వ్యవస్థ సామర్థ్యం పెరుగుతుందన్నారు. బి.ఈ.ఎల్ జనరల్ మేనేజర్ డాక్టర్ సీహెచ్ విశ్వనాథన్ మాట్లాడుతూ పరిశ్రమలు ఆశిస్తున్న నైపుణ్యం విద్యార్థులు పొందాలంటే హార్డ్‌వేర్ టెక్నాలజీలో వస్తున్న మార్పులపై దృష్టి సారించాలన్నారు. వీఎస్ఎల్ఐ కోర్ టెక్నాలజీపై సాధన చేసి మెలకువలు పెంచుకోవాలని సూచించారు. బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కొరకు బీఈఎల్‌లో అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఎఫ్‌ట్రానిక్స్ అధిపతి డి. రామకృష్ణ మాట్లాడుతూ డిజిటల్ అల్గారిథం డెవలప్‌మెంట్, గణిత శాస్త్ర ప్రావీణ్యం భవిష్యత్తును అంచనా వేయగల స్మార్ట్ సిస్టమ్స్ మీద అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎఫ్‌ట్రానిక్స్ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ కల్పిస్తామని సూచించారు. గౌరవ అతిథి ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ ఈ. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వివిధ దేశాల శాటిలైట్ సిస్టం, రిసెప్షన్ డేటా ఎనాలిసిస్ చేసే సాంకేతికతలను పుస్తకపఠనం మీద మాత్రమే ఆధారపడకుండా పోటీపడి నేర్చుకోవాలన్నారు. పి.రాఘవేంద్రరావు అడ్వాన్స్ నావిగేషన్ గైడ్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్ ఫర్ మిస్సైల్స్ స్పెక్ట్రమ్ అనే అంశంపై ప్రసంగించారు. ఈ సదస్సుకు వివిధ కళాశాల నుంచి 300మంది హాజరయ్యారు. సదస్సులో ఇన్‌ఛార్జి రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఓఎస్‌డీ ప్రొఫెసర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీలి మీడియా ద్వారా ప్రజాధనాన్ని దోచుకున్న జగన్

● సభా సంఘం ద్వారా విచారణ జరిపించాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆనందబాబు



అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జూలై 26: రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసం చేయడంతో పాటు ప్రజాస్వామ్య విలువలను మంటగలిపి జగన్ ముఖ్యమంత్రిగా ఉండి ఐదేళ్ల కాలంలో నీలి మీడియా ద్వారా ప్రజాధనాన్ని దోచుకున్నారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీలో ఆయన గళం విప్పారు. అడ్డగోలుగా నీలి మీడియాకు ప్రజధనాన్ని దోచిపెట్టి దుర్వినియోగం చేశారన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా అనేది ఫోర్త్ ఎస్టేట్. మన రాష్ట్రంలో అలా కాకుండా జగన్ కోసం మీడియా లాగా వ్యవహరించారన్నారు. రాజశేఖరరెడ్డి అధికారంలో ఉండగా దానిని అడ్డం పెట్టుకుని క్విడ్ ప్రోకో ద్వారా వేల కోట్లు సంపాదించిన జగన్ ఒక్క రూపాయి పెట్టుబడి లేకుండా రూ.1250 కోట్లతో అదే మీడియా సామ్రాజ్యాన్ని ఏర్పాటుచేసుకున్నాడని, అదే సాక్షి మీడియా అన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత అదే క్విడ్ ప్రోకోను కొనసాగిస్తూ అదే సాక్షిని అడ్డాగా మార్చుకుని బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చుకున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రకటన ద్వారా తెలియజేసే సందర్భంలో గత ప్రభుత్వాలను విమర్శిస్తూ ప్రకటనలు ఇచ్చేవారని, ప్రభుత్వం వారు ఇచ్చిన వివరాల ప్రకారం గత ఐదేళ్లలో వార్తా పత్రికలకు ఇచ్చిన ప్రకటనల ఖర్చు రూ.850కోట్ల పైచిలుకు కాగా అందులో సాక్షి మీడియాకు 300 కోట్లు పైగానే ఖర్చు చేసినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. సర్క్యులేషన్ లేని ఇంగ్లీష్ పేపర్లకు ప్రకటనలు ఇచ్చి ఆ పేపర్ల ద్వారా జగన్‌కు అనుకూలంగా సర్వేలు ఇప్పించుకున్నాడని చెప్పారు. డిజిటల్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి రూ.120కోట్లు ఆ కార్పొరేషనుకు అప్పజెప్పారన్నారు. ఐడ్రీమ్ యూట్యూబ్ చానల్‌లో పనిచేసే వాసుదేవరెడ్డిని డిజిటల్ కార్పొరేషన్ ఎండీగా కూర్చోబెట్టి వాళ్లకు దోచిపెట్టి సాక్షి మీడియాలో పనిచేసే సిబ్బందికి కూడా ప్రభుత్వ సొమ్మునే జీతాలుగా చెల్లించారన్నారు. వీటన్నింటిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని, దీనిపై సభా సంఘాన్ని నియమించి ఐదేళ్ల కాలంలో జరిగిన దుర్వినియోగం వెలికి తీయాల్సిందిగా అసెంబ్లీ సాక్షిగా ఆధారాలు చూపుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఎర్రకుంటపై మరలా కబ్జాదారుల కన్ను

● విలువైన భూమి స్వాహాకు యత్నం ● నోట్ల మత్తులో రెవెన్యూ అధికారులు



ఎర్రకుంట భూమిని పూడ్చడానికి తోలిన మట్టి కుప్పలు, గతంలో ఎర్రకుంటను మట్టితో పూడ్చి కబ్జా చేసిన కొంత భూమి

కారంపూడి, జూలై 26: కారంపూడి-వినుకొండ రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకు పక్కన దశాబ్దాల కాలంగా ఎర్రకుంట భూమి ఉంది. ఈ కుంటలో పశువులు, మేకలు, ఆవులు దాహార్తిని తీర్చుకుంటాయి. వేసవి కాలంలో సైతం ఈ కుంట నీరు అన్ని జీవాలకు తాగునీటిని అందిస్తుంది. కారంపూడిలోని సర్వే నం.772/3లో 4.82 ఎకరాల కుంట భూమి ఉంది. ఈ భూమిపై గత జనవరిలో అప్పటి అధికారపార్టీ వైసీపీ నేతల కన్ను పడింది. కొద్దికొద్దిగా పూడ్చుకుంటూ మట్టితోలి చదును చేశారు. అప్పుడు పత్రికలన్నీ ఈ కబ్జాను వెలుగులోకి తేవడంతో తప్పని పరిస్థితుల్లో రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పెట్టారు. మరలా దీనిపై కబ్జాదారుల కన్ను పడింది. బోర్డును పీకిపారేసి కుంటను పూడ్చడానికి మట్టిని తోలిస్తున్నారు. రహదారి పక్కనే ఉన్న ఈ భూమికి మంచి గిరాకీ ఉంది. దీనిని కబ్జా చేసి సొంతం చేసుకోవాలనే ఆశ కబ్జాదారుల్లో మొదలైంది. దీనిలో కొంత భాగాన్ని సరిహద్దు పొలాల వారు కలిపేసుకున్నారు. ఈ ప్రాంతంలోనే పెట్రోల్ బంకు ఏర్పాటవడంతో భూమికి ధర పెరిగింది. రెవెన్యూ శాఖ దీనిపై మరలా దృష్టి సారించి కొలతలు వేసి భూమి చుట్టూ పెన్సింగ్ వేసి కుంటభూమి మనుగడను కాపాడి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుద్యోగ భృతికి వయోపరిమితి 45 సంవత్సరాలకు పెంచాలి

● ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు



మాట్లాడుతున్న పరుచూరి రాజేంద్రబాబు, పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), జూలై 26: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి ఎటువంటి ఆంక్షలు లేకుండా రూ.3వేలు ఇవ్వాలని, కనీస వయోపరిమితి 35 నుంచి 45 సంవత్సరాలకు పెంచాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం గుంటూరు, మల్లయ్య లింగంభవన్‌లో జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్రబాబు మాట్లాడుతూ యువనేస్తం పథకం కుటుంబంలో ఎవరికైనా పెన్షన్ వస్తే ఇవ్వమని, కనీస ఆదాయం రూ.10వేలకు మించి ఉండకూడదని, గ్రామీణ ప్రాంతాల్లో ఐదు ఎకరాల కంటే సాగు భూమి ఉండకూడదని, పట్టణ ప్రాంతాలలో 1500 చదరపు అడుగుల నివాస స్థలం ఉండకూడదనే షరతులను పెట్టడం సరికాదన్నారు. డీఎస్సీని పాత పద్ధతిలోనే నిర్వహించాలన్నారు. నూతన విధానం ఆన్‌లైన్లో నిర్వహించడం వలన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, పరీక్షను ఆఫ్‌లైన్‌లోనే నిర్వహించాలన్నారు. సమావేశంలో నాయకులు షేక్ వలి, చల్లా మరిదాసు, జాలాది, నవీన్ బిల్లా రాజేష్, నాసర్‌జీ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా - గుంటూరు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియ ప్రారంభం

● ఓటర్ల జాబితాల రూపకల్పనకు షెడ్యూల్ విడుదల ● వచ్చే ఏడాది మార్చి 29వ తేదీతో ముగియనున్న పదవీకాలం

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ప్రక్రియ ప్రారంభమైంది. జాతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వచ్చే ఏడాది మార్చిలో జరగబోయే ఈ ఎన్నిక కోసం తాజా ఓటర్ జాబితాలను సిద్ధం చేయాల్సి ఉంది. ఆ మేరకు చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్ యాదవ్ శుక్రవారం ఓటర్ జాబితాల రూపకల్పనకు షెడ్యూల్‌ని ప్రకటించారు. ఈ ఏడాది నవంబరు 1వ తేదీ నాటికి ఎవరైతే పట్టభద్రులు ఉంటారో వారు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ నమోదు చేయడం అనేది ఓటరు ఇష్టం.

- సెప్టెంబరు 30వ తేదీన ఓటర్ జాబితాల రూపకల్పనకు నోటిఫికేషన్‌ని విడుదల చేస్తారు.
- అక్టోబరు 16న మరోసారి రీపబ్లికేషన్ చేస్తారు.
- అక్టోబరు 25న రెండో రీపబ్లికేషన్ చేస్తారు.
- నవంబరు 6వ తేదీ వరకు ఫారం-18, 19లో దరఖాస్తులు స్వీకరిస్తారు.
- నవంబరు 20వ తేదీ లోపు ముసాయిదా ఓటర్ల జాబితాలను ముద్రిస్తారు.
- నవంబరు 23వ తేదీన ముసాయిదా ఓటర్ జాబితాలు ప్రకటిస్తారు.
- నవంబరు 23 నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేసేందుకు అవకాశం కల్పిస్తారు.
- డిసెంబరు 25వ తేదీన క్లెయిమ్‌లు, అభ్యంతరాలు పరిష్కరించి సప్లిమెంట్ ఓటర్ జాబితాలను ముద్రిస్తారు.
- డిసెంబరు 30వ తేదీన తుది ఓటర్ల జాబితాని ప్రచురిస్తారు.

రూ.3.36 లక్షల పురుగుమందుల అమ్మకాలు నిలిపివేత

గుంటూరు సిటీ, జూలై 26: గుంటూరులోని ఏటుకూరు రోడ్డులో ఉన్న పురుగుమందుల గిడ్డంగుల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ తనిఖీలలో ఆగ్రో సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి చెందిన కూల్‌స్టార్ అనే పురుగుమందులను స్టాక్ బోర్డునందు, స్టాక్ రిజిస్టర్ నందు వివరాలు సరిగా నమోదు చేయకుండా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. వ్యవసాయశాఖ అనుమతులు లేకుండా ఈ పురుగుమందులను అమ్ముచున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. రూ.3,36,300 విలువైన 100 లీటర్ల పురుగుమందు అమ్మకాలు నిలిపివేస్తూ ఆదేశాలు జారీచేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయ అధికారి ఖడ్గం రమణకుమార్, స్థానిక వ్యవసాయ అధికారి బీ గౌతంప్రసన్న పాల్గొన్నారు.



ఏటుకూరు రోడ్డులోని పురుగుమందుల గిడ్డంగుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

తల్లీబిడ్డలను కలిపిన 'ఆధార్'

● చిన్నతనంలో తప్పిపోయిన మానసిక దివ్యాంగులు ● పదేళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు..



ఆశ్రమంలో తల్లిదండ్రులతో కోటప్పకొండ గ్రామానికి చెందిన రాజు, ఇమాన్యుయేల్

శివ్వంపేట, జూలై 26: ఆ ముగ్గురి మానసిక స్థితి సరిగ్గా లేదు. ఇందులో ఇద్దరు సోదరులు 12 క్రితం, మరొకరు 9 ఏళ్ల క్రితం తప్పిపోయారు. ముగ్గురూ మెదక్ జిల్లా శివ్వంపేట మండలం మగ్దుంపూర్ గ్రామం లోని సజీవ ర్గీస్ నెలకొల్పిన బేతాని సంరక్షణ అనాధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్నారు. వారికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయించేందుకు ఆశ్రమ నిర్వాహకులు తీసుకెళ్లగా.. వారు అనాథలు కారు. వారికోసం అప్పటినుంచి కుటుంబసభ్యులు వెతుకుతూనే ఉన్నారని తేలింది. తమ బిడ్డలు క్షేమంగా ఉన్నారని తెలుసుకుని వారు ఆనందపడి తమ పిల్లలను తీసుకెళ్లారు. వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా నరసరావుపేట మండలం కోటప్పకొండ గ్రామానికి చెందిన దాసరి నాగేంద్ర, శీను దంపతులు ఎల్బీనగర్‌లో ఉంటూ వెంట్రుకల వ్యాపారం చేస్తుంటారు. వారికి ఇద్దరు మానసిక దివ్యాంగులైన కుమారులు రాజు (13), ఇమ్మానియేల్(9) ఉన్నారు. 12 ఏళ్ల క్రితం రాజు మారాం చేస్తుండటంతో తల్లి డబ్బులు ఇచ్చి కిరాణా షాపులో కొనుక్కోమని పంపించింది. అప్పుడు తప్పిపోయిన రాజు, ఇమ్మానియేల్ అటుఇటు తిరిగి బేతాని సంరక్షణ ఆశ్రమానికి చేరారు. అప్పటినుంచి అక్కడే ఉంటున్నారు. మానసిక దివ్యాంగుల పథకం పొందేందుకు ఆశ్రమ నిర్వాహకులు వారి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయించాలని ప్రయత్నించారు. అయితే, ఆధార్ రిజక్ట్ అయింది. ఆరా తీయగా, వారిపేరిట ఎక్కడో ఆధార్ నమోదైఉన్నట్లు తేలింది. వీరి ఆచూకీ కోసం ప్రయత్నించగా, తల్లిదండ్రుల చిరు నామా దొరికింది. వారికి సమాచారం ఇవ్వగా వారు శుక్రవారం ఆశ్రమానికి వచ్చి తమ బిడ్డలను అక్కున చేర్చుకున్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ వీరబాబు, ఆశ్రమం క్యాంప్ ఇన్‌చార్జి విన్సెంట్, సిస్టర్ కార్మాల్ ఉన్నారు.

పెదకాకానిలో యువకుడు ఆత్మహత్య

పెదకాకాని, జూలై 26: పెదకాకానిలోని వడ్డెరకాలనీలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... వడ్డెరకాలనీకి చెందిన వేముల చిట్టిబాబు(24) ట్రాక్టర్ డ్రైవర్. ఇతనికి భార్య, ఏడాది వయసుగల కుమారుడు ఉన్నాడు. ఇటీవల స్థానిక యువతితో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న చిట్టిబాబు భార్య ఆ మహిళతో ఘర్షణ పడింది. ఇరువురు కొట్టుకున్నారు. ఈ వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. దీంతో చిట్టిబాబు భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని చిట్టిబాబు చనిపోయాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. వివాహేతర సంబంధమే మృతుడి ఆత్మహత్యకు కారణం అని పోలీసులు భావిస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

29,453 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 26,896 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 29,453 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 11,210 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	15500
నెంబరు.5	9000	12200
273	11000	11600
341	8500	13500
4884	--	--
సూపర్ 10	15000	15000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18500
బ్యాడిగి	8000	15000
దేవనూరుడీలక్స్	8500	11000
తెల్లకాయలు	4500	12000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8500	14500
నెంబరు. 5	10000	16000
273	12000	12000
341	8500	13500
4884	11800	16000
సూపర్ 10	--	--
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8500	18000
బ్యాడిగి	9000	13000
దేవనూరుడీలక్స్	9000	13000
తెల్లకాయలు	5000	11000

ఎస్పీని సత్కరించిన రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్


ఎస్పీని సత్కరిస్తున్న నారాయణభట్టు తదితరులు

బాపట్ల, జూలై 26 : జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తుషార్ డూడీని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ బీఎస్ నారాయణ భట్టు సభ్యులతో కలిసి సత్కరించారు. మర్యాదపూర్వకంగా శుక్రవారం ఎస్పీని కలిసిన రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు అభినందించారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే శాంతిభద్రతలపై దృష్టిసారించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు గురించి వివరించారు. ట్రాఫిక్, రోడ్డు సేఫ్టీ జాగ్రత్తలో కలిసి పని చేయాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో సభ్యులు జాన్‌వెస్లీ, సత్యనారాయణరాజు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆవుల సంచారాన్ని అరికట్టేందుకు చర్యలు : కమిషనర్

బాపట్ల, జూలై 26 : పట్టణంలో రోడ్లపై ఆవుల సంచారం అధికంగా ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నట్లు అనేక ఫిర్యాదులు వస్తున్నాయని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. వాహనచోదకులు, పాదచారులు, ప్రయాణికుల ఇబ్బందులతోపాటు పారిశుధ్య పనులకు ఆటంకంగా ఉన్న వీటిని యజమానులు తమ ఇళ్ళ వద్ద పెట్టుకోవాలని అనేకసార్లు నోటీసులు ఇవ్వటంతోపాటు కరపత్రాల ద్వారా ప్రచారం చేయటం జరిగిందన్నారు. ఈ విషయమై ఈనెల 29వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఆవుల యజమానులతో మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తప్పనిసరిగా ఆవుల యజమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలి : డీఈవో

బాపట్ల, జూలై 26 : రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి డీఈవో వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులు, ఉపవిద్యాశాఖాధికారుల ద్వారా దరఖాస్తులను ఆగస్టు 10లోపు అందజేయాలన్నారు.

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ


పౌష్టికాహారం కిట్‌లు అందజేస్తున్న రోటరీ క్లబ్ నాయకులు, సభ్యులు

బాపట్ల, జూలై 26 : బాపట్ల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కిట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వివేకానందకాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో 30 మందికి వీటిని అందజేశారు. రోటరీ అధ్యక్షుడు కోళ్ళపూడి ఉపేంద్రగుప్తా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ప్రతిరోజు ఆహారంలో ఆకుకూరలు, సంపూర్ణ పోషకాలు కలిగిన పాలు, గుడ్లు తీసుకోవాలన్నారు. దీనివల్ల పుట్టబోయే బిడ్డ ఎంతో ఆరోగ్యంగా పుడుతారన్నారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు అందిస్తే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి వెజండ్ల శ్రీనివాసరావు, డాక్టర్ త్రివేణి, కొల్లా శ్రీనివాసరావు, ఏలూరి హరిబాబు, జిట్టా శ్రీనివాసరావు, డాక్టర్ జాగర్లమూడి లక్ష్మీ, డాక్టర్ రావూరి వీరరాఘవయ్య, ఎస్‌కే మస్తాన్‌వలి, తోట కృష్ణ, ఎస్.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్‌గౌడ్‌కు ఘననివాళి

బాపట్ల, జూలై 26 : బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం విశేష కృషి చేసిన యెనుముల భాస్కర్‌గౌడ్ మృతి బాధాకరమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి బాపట్ల రవికుమార్ అన్నారు. బాపట్ల అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం బీసీసంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భాస్కర్‌గౌడ్ సంస్మరణసభ నిర్వహించారు. కార్యక్రమానికి బహుజనసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా రవికుమార్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కార దిశగా భాస్కర్‌గౌడ్ విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక, సమాజ్‌వాదిపార్టీ జిల్లా అధ్యక్షుడు గొర్ల శ్రీనివాసరావు, సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి మేకల ప్రసాద్, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుదే రాజారావు, అబ్దుల్ కలాం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పఠాన్ రాజేష్, దారా బాబురావు, సలగల చంటిబాబు, కేశవులు, మద్దిబోయన తాతయ్య, వెంకటేశ్వర్లు, శీలం రోజన్‌బాబు, శివమ్మ, ఎంపీ రంజాన్, ఆనంద్‌బాబు తదితరులు పాల్గొని భాస్కర్‌గౌడ్ సేవలను కొనియాడారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖ ప్రారంభం

బాపట్ల, జూలై 26 : పట్టణంలోని సూర్యలంకరోడ్డులో వివేకానంద కాలనీ దగ్గర సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన బ్రాంచ్‌ను ఏర్పాటు చేశారు. బ్రాంచ్‌ను శుక్రవారం హైదరాబాద్ జోనల్ హెడ్ దారాసింగ్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రభుత్వ రంగ సంస్థ అని చెప్పారు. తాము 5,181వ శాఖను ప్రారంభించామని తెలిపారు. డిపాజిట్ స్కీమ్స్, రిటైర్డ్‌లోన్స్, అగ్రికల్చర్ రుణాలు, ఎంఎస్ఎంఈ రుణాలు, ఇతర ప్రభుత్వ అనుబంధ స్కీమ్‌లు అదనంగా బ్రాంచ్ మీ సౌకర్యం మేరకు సురక్షితమైన సేఫ్టీ డిపాజిట్స్ లాకర్స్ అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ హెడ్ ఇ.వెంకటేశ్వరరావు, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రసన్నరాణి, చీఫ్ మేనేజర్ టీకే ప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ ఆర్.మణి మేఘాలై పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయశాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

బాపట్ల, జూలై 26 : ప్రకృతి వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖ రైతు సాధికారిత సంస్థ న్యాచరల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయంలో పని చేస్తున్న ఐసీఆర్ ఎల్1,ఎల్2, మాస్టర్‌ట్రైనర్‌ల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న వీరికి 18నెలలు నుంచి వేతనాలు అందించటంలేదని, వెంటనే వాటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 29వ తేదీన గుంటూరులో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కమిటీ ఎంపిక జరిగింది. సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షులుగా సీహెచ్ మజుందార్, అధ్యక్షులుగా ఎం.సుధాదేవి, ఉపాధ్యక్షులుగా డి.నాగరాజు, కె.ఆదిలక్ష్మీ, ఎస్.శివనాగేశ్వరమ్మ, ప్రధాన కార్యదర్శిగా వి.వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా జి.జ్యోతి, ఎం.వజ్రమ్మ, సీహెచ్ లక్ష్మీనారాయణ, కోశాధికారిగా సీహెచ్ సీమోనులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎ.ప్రసాద్, వి.వెంకటేశ్వర్లు, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెంసెంటర్‌లో రహదారి ఏర్పాటు


కర్లపాలెం సెంటర్‌లో రహదారిని సరిచేసిన చిత్రం

కర్లపాలెం, జూలై 26 : 'అస్థవ్యస్థ రహదారితో ప్రజలు ఇక్కట్లు' అనే శీర్షికన ఈనెల 20వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కర్లపాలెం సెంటర్‌లో వాహనాలు దిగటానికి, ఎక్కటానికి అనువుగా లేక ప్రజలు, ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్న విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి గురువారం రాత్రి రహదారిని ప్రయాణించేందుకు అనువుగా ఏర్పాటు చేశారు. రహదారిని సక్రమంగా ఏర్పాటు చేయటంతో మండల ప్రజలు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గ్రామ సభలు సద్వినియోగంచేసుకోవాలి : ఎంపీటీసీ


గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు

కర్లపాలెం, జూలై 26 : గ్రామ పంచాయతీలలో అధికారులు నిర్వహించే గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు అన్నారు. మండలంలోని కొత్తనందాయపాలెంలో సర్పంచ్ ఆట్ల వెంకటేశ్వరమ్మ, అయ్యప్పరెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో సాంబశివరావు పాల్గొని గ్రామ సభ విశిష్ఠత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. జలజీవన్‌మిషన్ ప్రాముఖ్యత, మరుగుదొడ్ల నిర్మాణం గురించి ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆట్ల వెంకటేశ్వరమ్మ, అయ్యప్పరెడ్డి, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ ఎ.దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులకు ఘన నివాళులు


ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, సభ్యులు

బాపట్ల, జూలై 26 : కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమంలో భాగంగా మాజీ సైనిక సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు ఆధ్వర్యంలో అమరవీరులకు ఘననివాళులు అర్పించారు. విజయలక్ష్మీపురంలోని మాజీ సైనిక సంక్షేమ సంఘ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాంబశివరావు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో భారతదేశ విజయానికి ప్రాణాలు అర్పించిన సైనికులకు నివాళులు అర్పించి వారి త్యాగాలను కొనియాడారు. నియోజకవర్గంలోని చందోలు గ్రామానికి చెందిన షేక్ బాషా, జిల్లాలోని నిజాంపట్నంకు చెందిన షేక్ మస్తాన్‌లు ఈ ప్రాంతవాసులు కావటం గర్వకారణమన్నారు. అనంతరం అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి సయ్యద్ అఖిల్, జాయింట్ సెక్రటరి అనోది రామకృష్ణారెడ్డి, కోశాధికారి పువ్వాడ యలమంద, ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేషన్ కమిటీ జిల్లా అధ్యక్షులు సుంకర శేషగిరిరావు, సీనియర్ సైనికులు అబ్దుల్ రజాక్, మేకా ఏడుకొండలురావు, అబ్దుల్ రహమాన్, యేమినేని సురేంద్ర, రుక్మదరావు, డి.వెంకటేశ్వర్లు, పసుపులేటి ప్రసాద్, పి.రాధాకృష్ణమూర్తి, కె.ఆంజనేయులు, రాంప్రసాద్ రెడ్డి, బసివిరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, అడే కిషోర్, అడే రాఘవదేవి, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు, జూలై 26 : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం అమరవీరుల దివస్ కార్యక్రమాన్ని మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కార్గిల్ విజయ్ దివస్‌లో భాగంగా భారత సైనికుల ధైర్య సాహసాలు వీరోచిత పోరాటాలతో పాకిస్తాన్ శత్రువులను తరిమికొట్టి కార్గిల్ కొండలపై మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేసిన రోజు చారిత్రాత్మక దినోత్సవమని, కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన భారత సైనికులకు శిరస్సు వంచి వందనం, వారి ధీరత్వానికి జోహార్లు అర్పిస్తూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జలజ, ఏపీఎం శ్రీమన్నారాయణ, మండల సమాఖ్య కార్యదర్శి కట్టా జ్యోతి, సీసీలు తదితరులు పాల్గొన్నారు.


అమరవీరుల దివస్‌ను నిర్వహిస్తున్న ఉద్యోగులు

ప్రగడ కోటయ్య ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి


ప్రగడ కోటయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చేనేత కార్మికులు, నాయకులు

రేపల్లె, జూలై 26 : చేనేత పితామహుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు స్వర్గీయ ప్రగడ కోటయ్య ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్ళాలని చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు పట్టెం శ్రీనివాసరావు అన్నారు. ప్రగడ కోటయ్య 109వ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ చీరాల నియోజకవర్గం నుంచి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యుడిగా ఉండి చట్టసభల్లో చేనేత సమస్యలపై తన గళాన్ని విప్పి వారికి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు, నారాయణం రామ్మోహన్‌రావు, కె.సుబ్బారావు, ఆర్.శ్రీనివాసరావు, ఎ.రాంబాబు, జీ.రాఘవయ్య, బి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, జూలై 26 : చేనేత సమస్యలపై నిరంతరం పోరాడిన మహనీయుడు ప్రగడ కోటయ్యను ఎన్నటికి మరువరాదని రాష్ట్ర బీసీ సంఘ నాయకుడు దివి రాంబాబు అన్నారు. ప్రగడ కోటయ్య జయంతి వేడుకలను శుక్రవారం చెరుకుపల్లిలోని ఘనంగా నిర్వహించారు. ఆయన మట్లాడుతూ రాష్ట్రంలోని చేనేత కార్మికుల సమస్యలను తెలుసుకుని సమస్యల పరిష్కార దిశగా పయనించాలన్నారు. తొలుత ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజలకు పులిహోర, లడ్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చేనేత సంఘ నాయకులు కందుల వెంకటేశ్వరరావు, దివి శ్రీనివాసరావు, వంగర చక్రవర్తి, అవ్వారు రామారావు, అందె సాంబశివరావు, పట్టెం వెంకటేశ్వరరావు, మాచర్ల బ్రహ్మం, కె.వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, జూలై 26 : చేనేత కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన చేనేత సూరీడు, ప్రజా బంధు ప్రగడ కోటయ్య కార్మికుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే ఉంటారని పలువురు పద్మశాలీయ ప్రజాప్రతినిధులు ఆయన సేవలను కొనియాడారు. ప్రగడకోటయ్య జయంతిని పురస్కరించుకుని భట్టిప్రోలులోని రథం సెంటర్ వద్ద గల ప్రగడకోటయ్య విగ్రహానికి శుక్రవారం పద్మశాలీయ సంఘీయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కె.పిచ్చియ్యశాస్త్రి, ఎంపీటీసీ కె.పద్మావతి, సంఘీయులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చెరుకుపల్లి, జూలై 26 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని ఎంపీడీవో శ్రీనివాసమూర్తి అన్నారు. చెరుకుపల్లిలో శుక్రవారం పారిశుధ్య కార్యక్రమంపై ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెత్త నిల్వలను రహదారులపై వేయరాదని, ఇంటివద్ద ఉంచుకుని పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జీ.మురళీకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, నాయకులు మొఖమాటం రాధాకృష్ణమూర్తి, దివి రాంబాబు, నాగుల పున్నారావు, యేనుగుల కోటేశ్వరరావు, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో గేదెల చావిడి, రెండు పశువులు మృతి

రేపల్లె, జూలై 26 : మండలంలోని కైతేపల్లిలో అల్లపర్తి సుబ్బారావుకు చెందిన గేదెల చావిడి ప్రమాదశాత్తు అగ్నిప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో రెండు గేదెలు, చావిడి పూర్తిగా కాలిపోయాయి. ఒక గేదె సగంపైగా కాలింది. పశు సంవర్థశాఖ సహాయసంచాలకులు డాక్టర్ నాంచారయ్య పశువుకు తక్షణమే వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. డాక్టర్ ప్రవీన్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని గాయాలతో ఇబ్బంది పడుతున్న పశువులకు వైద్యసేవలు అందించారు. ప్రమాదంలో రూ.1.50 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు.

జలజీవన్ పనులపై గ్రామసభ

పిట్టలవానిపాలెం, జూలై 26 : మండలంలోని చందోలు గ్రామ పంచాయతీలోని సచివాలయం-1లో శుక్రవారం చందోలు గ్రామసర్పంచ్ గౌరిదేవి విజయకుమారి ఆధ్వర్యంలో ఓడీఎఫ్, జలజీవన్‌మిషన్ అంశాలపై గ్రామసభ నిర్వహించినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి ఎస్వీఆర్ శేషగిరిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఆయా అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనానికి వేలం పాట

పిట్టలవానిపాలెం, జూలై 26 : మండలంలోని అల్లూరు గ్రామపంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించి 1979లో నిర్మితమైన పాఠశాల పాతబిల్డింగ్ శిథిలావస్థలో ఉన్నందున భవనాన్ని పడగొట్టటానికి కార్యాచరణ చేపట్టినట్లు, దీనికి సంబంధించి పనులకు ఈనెల 27న ఉదయం 9 గంటలకు వేలంపాట నిర్వహించటం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.పద్మారావు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు తెలిపారు. ఈ వేలం పాట పాఠశాల ప్రాంగణంలో జరుగుతుందని, ఆసక్తి కలిగిన వారు పాల్గొనవచ్చునని చెప్పారు.

మహిళా ఉద్యోగితో వైసీపీ నాయకుడి అసభ్య ప్రవర్తన

బాపట్ల,జూలై 26 : బాపట్ల పట్టణంలో పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగి పట్ల మండలానికి చెందిన వైసీపీ నాయకుడు అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్నట్లు సమాచారం. ఉద్యోగినిపై శుక్రవారం చేయిచేసుకున్నట్లు తెలిసింది. దీంతో పెద్దలంతా పిలిపించి సదరు వ్యక్తిని విచారించినట్లు సమాచారం. దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు రాలేదు. ఇదేవిధంగా వేధింపులకు గురిచేస్తే చర్యలు తప్పవని పెద్దలు హెచ్చరించినట్లు తెలిసింది.

పేదలకు బియ్యం పంపిణీ

కర్లపాలెం, జూలై 26 : కర్లపాలెంలోని అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యం లో ఫౌండేషన్ అధ్యక్షుడు, గ్రామ ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా ఎం.వి.రాజుపాలెంలో నిరుపేద మహిళలకు శుక్రవారం బియ్యం పంపిణీ చేశారు. నిరుపేద మహిళలకు ప్రతి శుక్రవారం తమ ట్రస్ట్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తున్నామని పఠాన్ అహ్మద్‌బాషా వివరించారు. ఈ కార్యక్రమంలో షేక్ హనీఫ్, షేక్ జిలానీ, షేక్ ఇబ్రహీం, పఠాన్ కరీముల్లా, షేక్ యాసిన్, షేక్ జానీ బాషా తదితరులు పాల్గొన్నారు.


పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న కర్లపాలెం ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా

● కర్లపాలెంలోని శ్రీగురువాణి ధ్యాన కేంద్రంలో బ్రహ్మర్షి సుభాష్ పత్రిజీ ఆరాధనోత్సవాలలో భాగంగా నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు.


విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న యూనియన్ బ్యాంకు మేనేజర్ ఇందిరా సరోజిని

విద్యార్థులకు మొక్కలు పంపిణీ

కొల్లూరు, జూలై 26 : విద్యార్థులకు మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కొల్లూరులోని యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం సాయివాసవీ విద్యా సంస్థ విద్యార్థులకు బ్యాంకు మేనేజర్ ఇందిరా సరోజిని మొక్కలు అందజేశారు. విద్యా సంస్థ క్రీడా ప్రాంగణంలో విద్యార్థుల సహాయంతో బ్యాంకు అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. విద్యా సంస్థ డైరెక్టర్ ఉప్పు శ్రీనివాసరావు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు గుమ్మడి రామమోహనరావు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు, ఉపాధ్యాయులు

అమృతలూరు, జూలై 26 : వాతావరణం అనుకూలంగా ఉండేందుకు మొక్కలు ఎంతో దోహదపడతాయని యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ చక్రపాణి అన్నారు. మండల పరిధిలోని గోవాడలో ప్లాంటేషన్ ప్రోగామ్‌లో భాగంగా శుక్రవారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మొక్కలు నాటారు. మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మండవ రమేష్, ఇన్‌చార్జి హెచ్ఎం శివశంకరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న బ్రాంచ్ మేనేజర్ చక్రపాణి తదితరులు

తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన పద్మావతి


తహసీల్దార్ పద్మావతి

చెరుకుపల్లి, జూలై 26 : తహసీల్దార్ సిహెచ్ పద్మావతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆమె రేపల్లెలోని ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా బాధ్యతలు నిర్వహించి బదిలీపై చెరుకుపల్లికి వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా పని చేసిన బ్రహ్మయ్య చిత్తూరు జిల్లా వెళ్ళారు.

బాలికా సంరక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

వేమూరు, జూలై 26 : బాలికా సంరక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వేమూరు ప్రభుత్వ పాఠశాలల కాంప్లెక్స్ కో-ఆర్డినేటర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శాంతిశ్రీ అధ్యక్షతన శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పద్మజ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట విరుద్ధమనే విషయాన్ని కూడా తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ప్రాంతీయ సూపర్‌వైజర్ మాధవి, క్రాప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కీర్తన, మహిళా పోలీసులు శ్రావణి, పవిత్ర, ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

ఊర చెరువులో చేపలు పెంచుకునేందుకు వేలం వాయిదా

పిట్టలవానిపాలెం, జూలై 26 : మండలలోని చందోలు గ్రామపంచాయతీలోని సచివాలయం-1లోని ఉర చెరువులో చేపలు పెంచుకొనటకు హక్కుపొందుటకు శుక్రవారం నిర్వహించాల్సిన వేలంపాట వాయిదా పడిందని సచివాలయ గ్రామపంచాయతీ కార్యదర్శి ఎస్వీఆర్ శేషగిరిరావు తెలిపారు. ఈ వేలంపాట ఎప్పుడూ జరిగేది అనేది త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

మంత్రి అనగాని ఆదేశాలతో డ్రెయిన్‌లో తూటికాడ తొలగింపు


పేటేరు, బేతపూడి డ్రెయిన్‌లలో ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న తూటికాడ

రేపల్లె,జూలై 26 : గత ప్రభుత్వ హయాంలో ప్రధాన డ్రెయిన్‌లు ఎక్కడా మరమ్మతులకు నోచుకోకపోవటంతో భారీగా గుర్రపుడెక్క, తూటికాడ పెరిగిపోవటంతో మురుగు నీరు పారుదలకావటం లేదని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి రైతులు తీసుకుని వెళ్ళారు. స్పందించిన అనగాని సొంత ఖర్చులతో ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసి తక్షణమే 25, 26, 27, 28 వార్డుల్లో పేటేరు చెరువునుంచి బేతపూడి కాల్వ వరకు తూటికాడను తొలగించే విధంగా పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ పనులను మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ దగ్గర ఉండి పరిశీలించారు. డ్రెయిన్‌లో తూటికాడ పేరుకుపోవటంతో వర్షపునీరు రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని, దీనిద్వారా వందలాది ఎకరాల పంట రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ డ్రెయిన్‌ల మరమ్మతులతో రైతులకు మేలు జరుగుతుందని, మంత్రి అనగానికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులు స్వచ్ఛందంగా కాల్వ పూడికతీత పనులు


పెనుమూడి రోడ్డులో సైడ్‌కాల్వను ఎక్స్‌కవేటర్ ద్వారా పూడికలు తీస్తున్న రైతులు

రేపల్లె, జూలై 26 : అధికారులు పూడుకుపోయిన సైడ్ చానల్స్ కాల్వలు అభివృద్ధి చేయకపోవటంతో రైతులే స్వచ్ఛందంగా తలో కొంత నగదు కూడబెట్టుకుని ఎక్స్‌కవేటర్ ద్వారా పూడికలు తీసుకుంటున్నారు. రేపల్లె మండలం పెనుమూడిరోడ్డులో సైడ్ కాల్వలు పూర్తిగా పూడుకుపోవటంతో సాగు నీరు రాకపోకలకు వర్షాలు పడితే కాల్వ నుంచి బయటకు నీరు వెళ్ళే పరిస్థితి లేకపోవటంతో చుట్టుప్రక్కల రైతులు నగదును పోగుజేసుకుని శుక్రవారం కాల్వపూడికతీత పనులు ప్రారంభించారు. ఏటా కాల్వలో మరమ్మతులు చేయకపోవటంతో అధిక వర్షాలు కురిసినా సాగునీరు పారుదలకాక నానా ఇబ్బందులను ఎదుర్కొవటంతో పాటు ఇంజన్ ఆయిల్ మోటార్లను పెట్టుకుని నీరు తోడుకోవాల్సిన పరిస్థితి నెలకొందని, గత ప్రభుత్వ హయాంలో కాల్వల మరమ్మతులు చేయించిన దాఖలాలు లేవని, ఖరీఫ్ సీజన్ ప్రారంభంకావటంతో కాల్వకు మరమ్మతులు చేసుకుంటున్నామంటూ రైతులు తెలిపారు.

అన్నక్యాంటిన్ పనులు ముమ్మరం


అన్నక్యాంటిన్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ ఏఈ రోహిణి

రేపల్లె, జూలై 26 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పేదవాడికి రూ.5లకే భోజనాన్ని అందించాలనే ఉద్ధేశ్యంతో ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటిన్‌ను సిద్ధం చేస్తున్నట్లు మున్సిపల్ ఏఈ రోహిణి అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ పార్కు వద్ద అన్న క్యాంటిన్ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని, బయట ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. చుట్టూ గ్లాస్‌ఫిట్టింగ్, గోడల మరమ్మతులు, ఆహారం అందించే విధంగా బల్లలు ఏర్పాటు చేయటం జరిగిందని చెప్పారు. ఆగస్టు 15న అన్న క్యాంటిన్‌ల ప్రారంభం సందర్భంగా పనులు 5వ తేదీకల్లా పూర్తి చేసేలా చూడాలన్నారు.

29న నేతన్నల ఆందోళన విజయవంతం చేయాలి

● రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల


సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీ

భట్టిప్రోలు, జూలై 26 : చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తక్షణమే సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలను నిర్వహించి, రాయితీల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. నేతన్న నేస్తం పథకాన్ని రూ.24 వేల నుంచి రూ.36 వేలకు పెంచి మగ్గం నేసే ప్రతి కార్మికునితోపాటు చేనేత ఉప వృత్తులనే ఆధారం చేసుకుని బతుకు సాగిస్తున్న కార్మికులకు నేతన్న నేస్తం వర్తింపచేయాలని, మగ్గం ఉన్న చేనేత కార్మికుని కుటుంబానికి నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేయాలని తదితర 15 డిమాండ్లతో కూడిన వినతి ప్రతాన్ని కలెక్టర్‌కు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో చేనేత సంఘం రాష్ట్ర సమితి సభ్యులు కొడాలి రామకోటేశ్వరరావు, కార్మికులు కె.వీరమోహనరావు, డొకుపర్తి రామారావు, ఏఐటీయూసీ నియోజకవర్గ నాయకులు బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎంపీడీవో పర్యవేక్షణలో పారిశుధ్య చర్యలు

వేమూరు, జూలై 26 : మండలంలోని పెరవలి, పెరవలిపాలెం గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య చర్యలు ప్రారంభించారు. ఎంపీ డీవో శేషగిరిరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమాల్లో పంచాయతీల కార్యదర్శులు, కార్మిక సిబ్బందితో పాటు ప్రత్యేక కూలీలను ఏర్పాటు చేశారు. మురుగునీటి పూడికలు తీయించి పల్లపు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరూ తాము నివసించే ప్రాంతాల్లో పరిశుభ్ర వాతావరణాన్ని నెలకొల్పాలని, తద్వారా ఆరోగ్యవంతులుగా జీవిస్తారని ఎంపీడీవో అన్నారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలు సందర్శించి పలుచోట్ల మొక్కలు నాటించారు. ఈవోపీఆర్డీ శేఖర్, కార్యదర్శులు శ్రీనివాసరావు, ప్రభు, సచివాలయాల సిబ్బంది, గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. పారిశుధ్య చర్యలపై ప్రత్యేక దృష్టి సారించిన ఎంపీడీవోను పెరవలిలో గ్రామస్థులు అభినందించి సత్కరించారు.


పెరవలిలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో శేషగిరిరావు

కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు

బాపట్ల, జూలై 26 : కోర్టు ఆదేశాల మేరకు ఏబీఎం స్కూల్ అమ్మిన, కొనుగోలు చేసిన వారిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో ఏబీఎం స్కూల్‌ను కొనుగోలు చేసినట్లు వైసీపీ నాయకుడు మోదుగుల బసవపున్నారెడ్డిపై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయన స్కూల్ వద్ద బోర్డు కూడా ఏర్పాటు చేశారు. దీనిపై ఇనగలూరి మాల్యాద్రి కోర్టును ఆశ్రయించగా మోదుగుల బసవపున్నారెడ్డితోపాటు తీయగూర నాగిరెడ్డి, కె.ప్రసాదరావు, జీడీడీ దివాకర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యు.శ్రీనివాసులు తెలిపారు.

పూడికతీత పనులు చేపట్టండి


మాట్లాడుతున్న కార్యదర్శి కోటినాగయ్య

ఇంకొల్లు, జూలై 26: పలు ప్రాంతాలలో మురుగుపారుదల లేక నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయని, వెంటనే పారిశుధ్యంపై దృష్టి సారించాలని గ్రామస్థులు విన్నవించారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని సమస్యలను సభలో కార్యదర్శి కోటినాగయ్య దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన మురుగు కాల్వ పూడిపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతుందన్నారు. పర్చూరు రోడ్డుకు ఇరువైపుల మురుగుకాల్వపై ఆక్రమణలను తొలగించి ఎప్పటికప్పుడు పూడికతీయాలన్నారు. అలాగే గ్రామంలో అధ్వానంగా ఉన్న పారిశుధ్యంపై దృష్టి సారించాలని గ్రామస్థులు సభలో కోరారు. చెరువులను శుభ్రం చేసి తాగునీరు సరఫరా చేయాలన్నారు. ఆయా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని కార్యదర్శి కోటినాగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు బెల్లం సాంబయ్య, మాలిక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత సైనికులకు రోటరీ సత్కారం

మార్టూరు,జూలై 26: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో ఏడుగురు విశ్రాంత సైనికులను రోటరీ క్లబ్ వారు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు అధ్యక్షత వహించారు. అనంతరం సభావేదిక పై విశ్రాంత సైనికులు పెనుబోతు హనుమయ్య(జొన్నతాళి), కొర్రపాటి కిషోర్ కుమార్ (కోనంకి),బీవీ రామారావు (జె పంగులూరు), అమరనేని శ్రీనివాసరావు (ముప్పవరం),పావులూరి చౌదరి(మార్టూరు), సందిపోగు డేవిడ్(మార్టూరు) బిల్లా భాస్కరరావు (మార్టూరు) లను క్లబ్ సభ్యులు శాలువాలు కప్పి పూలదండలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబ శివరావు, గరిమిడి శ్రీనివాసరావు, కొర్రపాటి కాజారావు, రావి అంకమ్మచౌదరి, చెన్నుపాటి బసవ రాములు,ఇంటూరి ఆంజనేయులు, ఎం ఈశ్వరప్రసాద్,తాళ్లూరి సాంబశివరావు,షేక్ కాజాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరునికి సమాచారాన్ని పొందే హక్కు



సమాచార హక్కు చట్టం గురించి అవగాహన కల్పిస్తున్న ఈవోఆర్డీ సుబ్బారావు

పర్చూరు, జూలై 26: సమాచారాన్ని పొందే హక్కు ప్రతి పౌరునికి ఉంటుందని మార్టూరు మండల ఈవోఆర్డీ బి.సుబ్బారావు అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో మండల వ్యవసాయాధికారి రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన సమాచార హక్కు చట్టం 2005పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈవోఆర్డీ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అధికారులు అందరూ కూడా పౌరులు అడిగిన సమాచారాన్ని 30 రోజుల లోపు అందించాలన్నారు. సెక్షన్ 4(1) ప్రకారం అధికారులు సమాచారానికి సంబంధించిన అన్ని రికార్డులు, రిజిస్టర్‌లను తప్పక నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏడీఏ మోహనరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు, ఈవోఆర్డీ రామకృష్ణ, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీపడొద్దు

చీరాల, జూలై 26: అన్న క్యాంటీన్ పునఃప్రారంభానికి సంబంధించిన పనుల నాణ్యతలో రాజీ పడొద్దని, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కుమారుడు డాక్టర్ మహేంద్రనాథ్ సూచించారు. శుక్రవారం ఆయన అన్న క్యాంటీన్ పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు సక్రమంగా అందేవిధంగా తగిన చర్యలు చేపడతామని ఎమ్మెల్యే కొండయ్య కుమారుడు డాక్టర్ మహేంద్రనాథ్ చెప్పారు. శుక్రవారం అక్కాయిపాలెం ఎత్తిపోతల పథకంలో జరిగిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు, రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆయకట్టులోని పలు గ్రామాల రైతు ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

నిధులు దోచేశారు..!

- గ్రామ పంచాయతీల్లో అంతా గోల్‌మాల్
- కరెంటు సామగ్రి, బ్లీచింగ్ పేరుతో వినియోగం
- లెక్కాపక్కా లేని రికార్డులు
- పంచాయతీల్లో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి..
- పంచాయతీ కార్యదర్శి, జూనియర్ సహాయకులకు షోకాజ్ నోటీసులు


సింగరాయకొండ పంచాయతీ కార్యాలయం

కొందరు అక్రమార్కులు అధికారం ముసుగులో నిధులను అడ్డంగా దోచేశారు. గత వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని పంచాయతీల్లోని కొంతమంది సర్పంచ్‌లు, అధికారులు తాము చెప్పిందే రాజ్యాంగమన్న విధంగా వ్యవహరించారు. నిధులను ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్ధంగా ఖర్చుచేశారు. అందుకు సంబంధించిన రికార్డులు, రసీదులు సక్రమంగా లేనేలేవు. ముఖ్యంగా ఒంగోలు డివిజన్ పరిధిలో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంది. మేజర్ పంచాయతీలైన సింగరాయకొండ, ఉప్పుగుండూరు, దొడ్డవరంల గ్రామాల్లో లక్షల రూపాయల నిధులను అక్రమంగా వినియోగించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామస్థుల ఫిర్యాదుల మేరకు విచారణ జరిపిన అధికారులు అవినీతికి పాల్పడిన ఒక్కొక్కరిపై వేటు వేస్తున్నారు. అధికారులపై సస్పెన్షన్ వేటు వేస్తుండగా, సర్పంచ్‌లకు చెక్‌పవర్ రద్దుచేస్తున్నారు.

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 26 : జిల్లాలోని పలు గ్రామపంచాయతీల్లో నిధుల వినియోగంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా మేజర్ పంచాయతీల్లో ఈ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికారులు వేగం పెంచారు. అక్రమార్కులపై దృష్టిపెట్టారు. ఈ నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా నిధులు వినియోగించిన ఘటనలు బయటకు వస్తుండటంతో పాలకవర్గాల్లో ఆందోళన నెలకొంది. ఉప్పుగుండూరు గ్రామపంచాయతీలో అయితే ఏకంగా సర్పంచ్‌కు తెలియకుండానే అప్పటి వైసీపీ నాయకుల అండదండలు చూసుకొని పంచాయతీ కార్యదర్శి నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి. పంచాయతీ నిధులు అక్రమం గా ఖర్చుచేశారని, వాటి వినియోగంపై విచారణ చేయాలని ఇటీవల ఆ గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

అయితే ఆ నిధుల వినియోగంపై విచారణకు ఆదేశించగా పలు అక్రమాలు చోటుచేసుకున్నట్లు వెలుగులోకి రావడంతో పంచాయ తీ కార్యదర్శి, జూనియర్ సహాయకులకు జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఆ పంచాయతీలో సుమారు రూ.42లక్షల నిధులు నిబంధనలకు విరుద్ధంగా ఖర్చుచేసినట్లు తెలిసింది.

సింగరాయకొండ గ్రామ పంచాయతీ జూనియర్ సహాయకులు సీహెచ్ విజయకృష్ణ పంచాయతీ రికార్డులు అప్పగించకుండా విధులకు గైర్హాజరు కావడంతో సస్పెండ్ చేస్తూ డీపీవో ఉషారాణి ఈనెల 16న ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ సర్పంచ్ తాటిపర్తి వనజకు షోకాజ్ నోటీసు ఇచ్చారు.

సింగరాయకొండగ్రామపంచాయతీలో నిధులు దుర్వినియోగంపై చేసిన విచారణ నివేదికను సకాలంలో ఇవ్వకపోవడంతో ఒంగోలు, కనిగిరి డివిజనల్ పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇస్తూ ఈనెల 16న డీపీవో ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు.

మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామపంచాయతీ వాటర్ స్కీం నిధులను దుర్వినియోగం చేశారని ఈనెల 16న సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అలాగే పంచాయతీ కార్యదర్శిని తాజాగా శుక్రవారం సస్పెండ్ చేశారు.

నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామపంచాయతీ జూనియర్ సహాయకులుగా ఉంటూ ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేసిన ఎం.శ్రీరామమూర్తి సర్పంచ్‌తో కలిసి రూ.42.70 లక్షల నిధులను అసాధారణంగా ఖర్చుచేసినట్లు డివిజనల్ పంచాయతీ అధికారి నివేదిక ఇచ్చారు. ఆ మేరకు కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

సింగరాయకొండలో భారీగా దుర్వినియోగం

సింగరాయకొండ మేజర్ పంచాయతీలో సుమారు రూ.40లక్షల మేరకు నిధులను డ్రా చేసినట్లు తెలిసింది. పంచాయతీ నిధుల వినియోగంలో పెద్దఎత్తున అవినీతి జరిగిందని జనసేన పార్టీ ఆ మండల నాయకుడితో పాటు మరికొంతమంది ఫిర్యాదులు చేశారు. ఆ ఫిర్యాదుపై విచారణ చేయడంతో జనరల్ ఫండ్ నుంచి రూ.13 లక్షలు, 15 ఆర్థికసంఘం నిధులు సుమారు రూ.38.73 లక్షలు డ్రా చేయగా అందులో రూ.24.87 లక్షలు సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతభత్యాలకు చెల్లించారు. మిగిలిన రూ.12లక్షల నిధులకు రికార్డులు లేని పరిస్థితి ఏర్పడింది. అక్కడ పనిచేసే జూనియర్ అసిస్టెంట్ గత జనవరి నుంచి తన కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లిపోయారు. దీంతో ఇటీవల ఆ ఆఫీసు తాళాలు పగలగొట్టి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు దొడ్డవరం గ్రామపంచాయతీలో గత వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని భారీగా నిధులను దుర్వినియోగం చేసినట్లు సమాచారం.

పంచాయతీ కార్యదర్శుల ద్వారా..

అనేక పంచాయతీల్లో ఉన్న అరకొర నిధులను పంచాయతీ కార్యదర్శుల ద్వారా సర్పంచ్‌లు అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా గ్రామాల్లో ఏదైనా అత్యవసర పనులు ఉంటే వాటిని పూర్తిచేసి నిధులు డ్రా చేస్తారు. కానీ అందుకు భిన్నంగా పారిశుధ్య నిర్వహణ కోసం అవసరమయ్యే బ్లీచింగ్, కరెంటు సామగ్రిలను కొనుగోలు చేసినట్లు తెలిసింది.

అందుకు సంబంధించిన రసీదులను కూడా ఇష్టారీతిన పెట్టినట్లు సమాచారం. సింగరాయకొండ గ్రామపంచాయతీలో అయితే పూర్వ పంచాయతీ కార్యదర్శుల సమయంలో విద్యుత్ సామగ్రి కొనుగోలు చేసినట్లు ఇప్పుడు బిల్లులు పెట్టారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయా గ్రామ పంచాయతీల్లో జరిగిన అవినీతి ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటంతో అక్రమార్కుల్లో అలజడి మొదలైంది.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామపంచాయతీ పూర్వ పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే జాన్ బాషాను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. జాన్‌బాషా ప్రస్తుతం బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం దైవాలరావురు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. దొడ్డవరం గ్రామపంచాయతీలో వాటర్‌స్కీంకు సంబంధించి రూ.25.02 లక్షల నిధులు దుర్వినియోగమయ్యాయి. ఇటీవల ఆ విషయంపై అధికారులు విచారణ చేపట్టారు. అయితే ఆ నిధులకు సంబంధించి జాన్‌బాషా అధికారులకు వివరాలు ఇవ్వలేదు. దీంతో వాటిని దుర్వినియోగం చేశారన్న అభియోగంతో ఆయనను సస్పెండ్ చేశారు. ఇప్పటికే ఆ పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై పంచాయతీ సర్పంచ్ చెక్‌పవర్‌ను కూడా రద్దుచేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు అరకొరగా ఉన్న నిధులను కూడా అధికారపార్టీ సర్పంచ్‌లు ఇష్టారీతిన ఎలాంటి బిల్లులు లేకుండా ఖర్చుచేశారు. ఆయా నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు రావడంతో వాటిపై విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలకు ఉపక్రమించారు.

వైద్యశాఖ ఉద్యోగుల్లో అలజడి

- ఎప్పుడో భర్తీచేసిన ఉద్యోగాలకు ఇప్పుడు విచారణలు
- శాఖలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని సిబ్బంది వణుకు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 26: జిల్లా వైద్యారోగ్యశాఖలో ఎప్పుడో భర్తీచేసిన పోస్టులపై ఇప్పుడు విచారణలు జరుగుతుండటంతో ఆ శాఖ ఉద్యోగుల్లో అలజడి నెలకొంది. 2004 నుంచి ఇప్పటివరకు జరిగిన నియామకాలపై రాష్ట్రస్థాయి అధికారులు విచారణలు చేస్తుండటంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. వైద్యశాఖలో 2002లో గుంటూరు రీజియన్ పరిధిలో భర్తీ చేసిన హెల్త్ అసిస్టెంట్ల నియామకాల్లో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఆ నేపథ్యంలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ శోభారాణి విచారణ చేపట్టారు.

ఇప్పటికే గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో విచారణ పూర్తికాగా గురువారం ఒంగోలులో విచారణ జరిగింది. 2002 నుంచి ఇప్పటివరకు 160 హెల్త్ అసిసెంట్లు పోస్టులు భర్తీచేయగా, వారిలో వందమంది ఉద్యోగులు రెగ్యులర్ అయ్యారు. మరో 60 మంది కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్నారు. ఇప్పుడు వారందరూ అందుకు సంబంధించిన నియామక ఉత్తర్వులతోపాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు చూపాల్సిన అవసరం వచ్చింది.

అంతా అయోమయం

సాధారణంగా ఉద్యోగ నియామకాల భర్తీలో అక్రమాలు జరిగాయంటే అప్పటి నోటిఫికేషన్‌తో పాటు రోస్టర్ విధానం, ఏ కేటగిరికి ఎన్ని ఇచ్చారు తదితర అంశాలతో విచారణ చేపడుతారు. అలా కాకుండా నేరుగా 2002 నుంచి ఇప్పటివరకు భర్తీచేసిన పోస్టులపై విచారణ పేరుతో ఉద్యోగులందరినీ వైద్యశాఖ కార్యాలయానికి పిలిపించడంతో వారిలో ఆందోళన నెలకొంది. వైద్యశాఖపై ఎప్పుడు ఎవరు ఫిర్యాదులు చేస్తారో, ఎప్పుడు ఎవరు విచారణ చేస్తారో తెలియదు, ఫిర్యాదులు వచ్చిన ప్రతిసారీ విచారణకు రావాలని ఆదేశాలిస్తుండటంతో దిక్కుతోచని స్థితిలో ఉద్యోగులు ఉన్నారు. గత నియామకాలపై అనేకమార్లు విచారణలు చేసి అక్రమాలు జరిగాయని నిర్ధారించినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజా విచారణ కూడా అలానే ఉంటుందా అన్న అనుమానాలున్నాయి. కేవలం ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేసేందుకే విచారణ చేస్తున్నారా? అన్న ఆరోపణలున్నాయి.

అసెంబ్లీలో ఆకట్టుకున్నారు

- వివరణాత్మక సమాధానాలిచ్చిన మంత్రులు
- నాలుగు సబ్జెక్ట్‌లపై అనర్గళంగా మాట్లాడిన ఏలూరి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కేవలం ఐదు రోజులే జరిగినప్పటికీ అసెంబ్లీ సమావేశాల సమయాన్ని సద్వినియోగం చేసుకోవటంలో జిల్లాలోని అధికారపార్టీ ఎమ్మెల్యేలు సఫలీకృతులయ్యారనే చెప్పుకోవచ్చు. తొలిసరిగా మంత్రులైనప్పటికీ ఇటు స్వామి అటు రవికుమార్ సభ్యుల ప్రశ్నలకు వివరణాత్మక సమాధానాలు ఇచ్చి మన్ననలు పొందారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు నాలుగు అంశాలపై అనర్గళంగా మాట్లాడారు. మిగిలిన ఎమ్మెల్యేలు సీఎం నుంచి ఇతర మంత్రులు, ఉన్నతాధికారుల వరకు తిరిగి ఆయా నియోజకవర్గాల సమస్యల పరిష్కారం కోసం తొలి అడుగు వేశారు. వైసీపీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు తొలిరోజు సమావేశాలకు అలా వచ్చి ఇలా వెళ్లిపోగా ఆ నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జిలు మాత్రం దరఖాస్తులు పట్టుకొని అసెంబ్లీ లోను బయట మంత్రుల చుట్టూ తిరగటం కనిపించింది.

ప్రస్తుతం ఐదురోజులు పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు అభివృద్ధి పనుల సాధన, సమస్యల పరిష్కారంలో కలిసికట్టుగా ముందడుగు వేశారు. అసెంబ్లీ బయట లోపల కూడా ఉమ్మడి జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు కలిసి తిరగటం ముఖ్యమంత్రి నుంచి ఆయా మంత్రుల వరకు కలిసి వెళ్లి మాట్లాడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేంద్రప్రభుత్వం జిల్లాను వెనుకబడిన ప్రాంతాల జాబితాలో చేర్చిన వెంటనే అందరూ సీఎంని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే స్పందించి ఐక్యంగా మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి రావటం పట్ల చంద్రబాబు కూడా ప్రత్యేకంగా అభినందించారు. ఆ సందర్భంలోనే ఎమ్మెల్యేలు జిల్లాకు సంబంధించి ఆయన ఇచ్చిన హామీలను గుర్తుచేయటం విశేషం. పర్చూరు, కందుకూరు ఎమ్మెల్యేలు ఏలూరి, ఇంటూరి సీఎంని కలిసి నియోజకవర్గాల సమస్యల చిట్టాను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర మంత్రులు నారాయణ, జనార్దన్‌రెడ్డి, రామానాయుడు, సత్యప్రసాద్‌తోపాటు జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులను ప్రత్యేకంగా కలిసి ఆయారంగాల వారి సమస్యలు వివరించి కొన్ని హామీలు పొందారు. గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తాగునీరు, గ్రామీణాభివృద్ధి సమస్యలపై అటు పవన్‌కళ్యాణ్ ఇటు లోకేష్‌తోపాటు కొందరు అధికారులను కలిశారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల సీఎంతోపాటు లోకేష్‌ను కలిసి పలు అంశాలను వివరించారు. ఎస్‌ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మంత్రులతోపాటు తనకున్న పరిచయాలతో కొన్ని శాఖల ఉన్నతాధికారులతో భేటీ అయి పలురంగాల అంశాలపై కదలిక తెచ్చుకోగలిగారు. మధ్యలో అటు వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ఇటు దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ అమరావతి వెళ్లి ముఖ్యమంత్రి, మంత్రులతోపాటు అధికారులను కలిసి కొన్ని సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.

ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు స్వామి, రవికుమార్‌లు వారి శాఖలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు దీటైన సమాధానాలు ఇచ్చి ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్‌ల దృష్టిని ఆకర్షించారు. మంత్రి స్వామి వద్ద ఎక్కువ శాఖలు ఉండటంతో నాలుగు రోజులుపాటు సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. శాసనమండలిలో విద్యుత్ రంగంపై వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి రవికుమార్ సమాధానమిస్తూ చెత్త ద్వారా విద్యుత్ ఉత్పత్తి కోసం నాడు చంద్రబాబు ప్రయత్నిస్తే, చెత్తపై పన్ను వేసి తలాతోక లేని నిర్ణయాలతో విద్యుత్ శాఖను జగన్ అప్పులపాలు చేశాడంటూ చక్కటి ఉదాహరణలతో ప్రసంగించారు. ఆ సమయంలో శాసనమండలిలో ఉన్న లోకేష్ కూడా రవి ప్రసంగాన్ని ఆసక్తిగా వినటం, చప్పట్లు కొట్టడం విశేషం. అన్ని అంశాలపై అవగాహన ఉన్న పర్చూరు ఎమ్మెల్యే ఏలూరికి ఎక్కువ సమయం మాట్లాడే అవకాశం కల్పించారు. నాడు-నేడు పనులు, గత ప్రభుత్వంలో జరిగిన విధ్వంసకర చర్యలపై ఆయన ప్రసంగించారు. ప్రధానంగా వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు ఎత్తిచూపుతా ఆయన అనర్గళంగా చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది.

సిండ్రైట్ ఫ్యాక్టరీలో నిషేధిత వ్యర్థాల వాడకం

- యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘన
- అధికారుల తనిఖీల్లో వెల్లడి
- గ్రామస్థుల నుంచి వివరాలు సేకరణ


సిండ్రైట్ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న అధికారులు

మేదరమెట్ల , జూలై 26: మేదరమెట్లలోని సిండ్రైట్ ఫ్యాక్టరీలో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయి. శుక్రవారం అధికారుల బృందం పరిశీలనలో ఇవి వెలుగుచూశాయి. నిషేధిత మిరప వ్యర్థాలను వినియోగిస్తుండటాన్ని అధికారులు గుర్తించారు. ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మిర్చి కోరును భరించలేక పోతున్నామని గ్రామస్థుల ఫిర్యాదు మేరకు అప్పటి ఇన్‌చార్జి కలెక్టర్ చామకుర్తి శ్రీధర్ ఫ్యాక్టరీ యాజమాన్యం, గ్రామస్థులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో నిర్ణయం మేరకు మిరప వ్యర్థాలను ఫ్యాక్టరీలో వినియోగించరాదని ఆదేశించారు. అయితే అధికారుల ఆదేశాలను ఫ్యాక్టరీ యాజమాన్యం బేఖాతరు చేసింది. శుక్రవారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనజర్ శివప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి వై. రామకృష్ణ, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరమేశ్వరరావు, బాయిలర్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాసులు, స్థానిక ఆర్ఐ పోతురాజుతో కలిసి సిండ్రైట్ ఫ్యాక్టరీని పరిశీలించారు. ఫ్యాక్టరీలో నిషేధిత మిరప వ్యర్థాలను వాడడం కనిపించింది. గతంలో ఇన్‌చార్జి కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను లెక్కచేయకుండా యాజమాన్యం వ్యర్థాలను వాడటంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ మొత్తం పరిశీలించిన అధికారుల బృందం యాజ మాన్యం పలు ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు గుర్తించింది. అనంతరం వీరంతా గ్రామంలో పర్యటించి గ్రామస్థులను ఫ్యాక్టరీ గురించి ప్రశ్నించారు. రోజంతా మిర్చి కోరు వస్తోందని, ఫ్యాక్టరీ అధికారులకు ఫోన్‌చేసినా స్పందించడం లేదని వారు తెలిపారు.

పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలి


ఉప్పుమాగులూరులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో హనుమారెడ్డి

బల్లికురవ, జూలై 26: వర్షాకాలం కావటం వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామాలలో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో హనుమారెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని కొప్పెరపాలెం, ఉప్పుమాగులూరు గ్రామాలలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలలో ఉన్న నిధులతో గ్రామాలలో మురుగు కాలువల్లో వ్యర్థాలను తొలగించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని ఆయన సూచించారు. ఈ పరిశీలనలో ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు,(బుజ్జి) పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు


బీజామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

చినగంజాం, జూలై 26: ప్రకృతి వ్యవసాయం చేయడం వలన తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ ఎంటీ పీ.భారతి అన్నారు. మండలంలోని చింతగుంపల్లి గ్రామంలో వీవోఏలు, పరిమళ, లలిత డ్వాక్రా గ్రూపు సభ్యులకు, రైతులకు బీజామృతం తయారీ విధానం, దాని వలన కలిగే ఉపయోగాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీజామృతంతో విత్తన, నారు శుద్ధి చేయవచ్చునని తెలిపారు. నీరు, ఆవుపేడ, ఆవు మూత్రం, పుట్టమట్టి, సున్నంతో బీజామృతం తయారు చేస్తారని తెలిపారు. దీనితో విత్తన శుద్ధి చేయడం వలన విత్తనానికి సంక్రమించే వ్యాధులు దరి చేరవని, విత్తనం పూర్తి స్థాయిలో మెలకెత్తడానికి ఉపయోగపడుతుందని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జయమ్మ, జి.విజయశాంతి, ఉదయభాస్కర్, జ్ఞానానందం, రైతులు, వీవోఏలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగించాలి

మార్టూరు: గ్రామాలలోని మహిళాసంఘాలు ప్రకృతి వ్యవసాయం రైతులకు అవగాహన కలిగించాలని డీపీఎం మోహన్ అన్నారు.శుక్రవారం వెలుగు కార్యాలయంలో మండలసమాఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంటీఎస్ నీలం ప్రకాష్ కుమార్ అధ్యక్షత వహించారు.ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీపీఎం మోహన్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాజారత్నం, కోటమ్మ, శంకర్, రహమాన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో నిర్మల

డిజిటల్ కంటెంట్‌పై అవగాహన కల్పించాలి

● డిప్యూటీ డీఈవో నిర్మల

పంగులూరు, జూలై 26 :పాఠశాల స్థాయిలో చేపట్టే శిక్షా సప్తహ్ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ కంటెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని చీరాల డిప్యూటీ డీఈవో నిర్మల కోరారు. మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల డైరీలను పరిశీలించి, పాఠ్య బోధనకు ఉపాధ్యాయులు రూపకల్పన చేసిన పాఠ్య ప్రణాళికలను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థుల విద్యాస్థాయి, సామర్థ్యాలను గుర్తించారు. గడిచిన విద్యా సంవత్సరంలో ఎన్.ఎం.ఎం.ఎస్‌లో సాధించిన ఫలితాలను, ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు లభించిన సీట్ల వివరాలను హెచ్‌ఎం గిరిజ వివరించారు. పాఠశాల నిర్వహణ తీరుపట్ల సంతృప్తిని వ్యక్తం చేసిన డిప్యూటీ డీఈవో నిర్మల పాఠశాల పురోభివృద్ధికి పలు సూచనలు చేశారు. గత విద్యా సంవత్సరంలో ఫలితాల సాధనలో ఉపాధ్యాయుల కృషిని అభినందించారు.


ముక్తేశ్వరంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న త్రీఫేస్ విద్యుత్ లైన్ పనులను పరిశీలిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తాం

● అద్దంకి ఈఈ నల్లూరి మస్తాన్‌రావు

బల్లికురవ. జూలై 26 : మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా చర్యలు చేపడుతున్నామని అశాఖ అద్దంకి ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో నూతనంగా బల్లికురవ మండల కేంద్రం నుంచి ఏర్పాటు చేస్తున్న త్రీఫేస్ విద్యుత్ లైన్ పనులను ఈఈ పరిశీలించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎక్కడైన లోవోల్టేజీ సమస్యలు లేకుండా విద్యుత్ సిబ్బంది పని చేయాలన్నారు. రైతులకు 9 గంటల వ్యవసాయ విద్యుత్ అందిస్తున్నామని, లైన్‌లలో లోపాలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. నేల జారిన విద్యుత్ వైర్లను వరుస క్రమంలో అన్ని గ్రామాలలో సరి చేయాలని సూచించారు. ఈపరిశీలనలో ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేగవంతంగా కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు

అద్దంకి: మెరుగైన విద్యుత్ సరఫరాకు కొత్త విద్యుత్ లైన్ల పనులు వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. అద్దంకి పట్టణంలోని 5 వ వార్డులో జరుగుతున్న కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులను ఈఈ శుక్రవారం పరిశీలించారు. డీఈఈ సత్యనారాయణ, ఏఈ శివప్రసాద్, టీడీపీ నేతలు వడ్డవల్లి పూర్ణచం ద్రరావు, చిలుకూరి అనిల్, బాచిన వెంకటసుబ్బారావు తదితరులు ఉన్నారు.


పనులకు సంబంధించి కొలతలు తీస్తున్న టీటీడీ అధికారుల బృందం

రాతి ముఖమండప నిర్మాణ పనుల పరిశీలన

అద్దంకి, జూలై26: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణ పనులను టీటీడీ అధికారుల బృందం శు క్రవారం పరిశీలించింది. రాతి ముఖ మండపం నిర్మాణానికి సుమారు 7 కోట్ల రూపాయలు అంచనా వ్యయం కాగా టీటీడీ నుంచి 2 కోట్ల రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి 2 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. ఈ నేపథ్యంలో టీటీడీ నిధులు విడుదలకు గాను ఇప్పటి వరకు జరిగిన పనులను టీటీడీ ఇంజనీరింగ్ అధికారుల బృందం శుక్రవారం పరిశీలించి కొలతలు తీసింది. విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ వీఎస్ పాల్, ఎంఆర్వో శేషయ్య, ఏఈ చిరంజీవి, టెంపుల్ ఏఈ దివ్య తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని లలితమ్మ హత్య కేసు

● ఓ వ్యక్తి, మాజీ వలంటీర్‌పై అనుమానం
● అతడి ఆచూకీ కోసం గాలింపు
● రౌడీ షీటర్‌ల స్టేట్‌మెంట్‌లు సేకరణ
● హంతకుడి వేటలో పోలీసులు


లలితమ్మ (ఫైల్)

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జూలై 26 : చీరాల మండలం ఈపూరుపాలెం విశ్రాంత ఉపాధ్యాయిని పిల్లి లలితమ్మ(78) హత్య కేసు ఇంకా కొలిక్కి రాలేదు. అయితే ఇప్పటి వరకు జరిగిన విచారణలో ఒక కేబుల్ బాయ్, బోయిన వారిపాలెంకు సంబంధించి మరొక వ్యక్తితో పొలంకు సంబంధించి స్వల్ప వివాదాలు ఉన్నట్లు తెలుస్తున్నాయి. అంతేకాకుండా ఆరోజు నుంచి సేకరించిన టవర్ డంప్‌ను నిశితంగా పరిశీలిస్తున్నారు. అలాగే అనుమానితునికి దగ్గరగా ఉన్న ఓ మాజీ వలంటీర్ సంఘటన జరిగిన మరుసటి రోజు నుంచి కనిపించకపోవడంపై అనుమానాలు పెద్ద ఎత్తున రేకెత్తిస్తున్నాయి. ఇప్పటికే చాలామంది ఫోన్ డేటాను కూడా పోలీసులు తీసినట్లు సమాచారం. రౌడీ షీటర్‌ల స్టేట్‌మెంట్‌లు రికార్డు చేస్తున్నారు. దాదాపుగా నేడో రేపో ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసు అధికారులు వెల్లడించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

ద్విచక్ర వాహనం నుంచి జారిపడిన మహిళ

● చీరాల ఏరియా వైద్యశాలకు తరలింపు

చీరాలటౌన్ జూలై 26 : ద్విచక్ర వాహనంపై నుంచి జారిపడిన మహిళను కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం చినగంజాం సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం చీరాల ఉడ్‌నగర్‌కు చెందిన జినేఖా గతకొద్ది కాలంగా ఎడమ కంటికి సంబంధించి ఇబ్బంది పడుతున్నారు. ఈక్రమంలో కుమారుడు హజ్రాన్‌తో కలిసి ఒంగోలు వెళ్లి చికిత్స తీసుకున్నారు. ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా చినగంజాం సమీపంలోని జాతీయ రహదారిలో బుర్కా వెనుక చక్రంలో ఇరుక్కుంది. దీంతో ఆమె ఒక్కసారిగా వాహనం నుంచి జారి కిందపడింది. దీంతో చికిత్స చేయించుకున్న కంటి వైపు తల రోడ్డుకు తగిలి బలమైన రక్త గాయమైంది. అంతేకాకుండా శరీరంపై పలు రక్త గాయాలు అయ్యాయి. దీంతో కుమారుడు 108 సహాయంతో తల్లిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

వజ్రాల వేటకు వేలం వెర్రిగా..

బల్లికురవ ప్రాంతం నుంచి పరుగులు
రోజూ వందల మంది
పల్నాడు జిల్లాకు వెళుతున్న వైనం


వజ్రాల కోసం భూమిలో వెతుకుతున్న ఓ కుటుంబం

బల్లికురవ. జూలై 26 : అదిగో అక్కడ విలువ కలిగిన వజ్రాలు భూమిలో దొరుకుతున్నాయి అని పుకార్లు షికార్లు చేస్తుండటంతో బల్లికురవ ప్రాంతం నుంచి ప్రజలు వేలం వెర్రిగా పల్నాడు జిల్లాకు వజ్రాల వేటకు పరుగులు పెడుతున్నారు. కొందరు మాత్రం తమకు కొన్ని తక్కువ పాయింట్లు కలిగిన వజ్రం దొరికిందని మరింత ఆశతో వెతుకులాటకు వెళుతున్నారు.

అదిగో పులి ఇదిగో మేక అన్న చందంగా ప్రజల పరిస్థితి నెలకొంది. ఏటా వ్యవసాయ సీజన్‌లో భూమిలో నుంచి వజ్రాలు బయట పడుతున్నాయి అని కొంత కాలం నుంచి ప్రజలలో ప్రచారం ఉంది. కొందరు వజ్రాలపై ఆశలతో పదిహేను రోజుల నుంచి బల్లికురవ ప్రాంతం నుంచి పల్నాడు జిల్లా నకరికల్లు మండలం శ్రీరామపురంకు పెద్ద ఎత్తున తరలి వెళుతున్నారు. అక్కడ ఎర్ర నేలలో వజ్రాలు బయట పడుతున్నాయి అని కొందరు ఆటోలు పెట్టుకొని మరి వలస వెళుతున్నారు. కొందరు వ్యవసాయ కూలీలు పనులు మానుకొని వజ్రాల వేటకు వెళుతున్నారు. కొందరు వజ్రాల పాయింట్లు తనిఖీ చేసే మిషన్ కూడా తీసుకుపోయి అక్కడే పనికి వచ్చే రాళ్లను ఏరుకొని తెచ్చుకొంటున్నారు. ఎక్కడ విన్నా గ్రామాలలో వజ్రాల వేట గురించే ప్రజలు చర్చించుకుంటున్నారు. కొందరు ప్రజలు మాత్రం ఇవి పుకార్లు అని కొట్టి పారేస్తుండగా కొందరు మాత్రం నిజంగా వజ్రాలు దొరుకుతున్నాయని నమ్ముతూ పల్నాడు జిల్లాకు వెళుతున్నారు. రెండు రోజుల క్రితం వజ్రాల కోసం వెళ్లిన వారిని పల్నాడు జిల్లాలోని పోలీసులు అడ్డుకొని వెనక్కి పంపించారు. అయినా కొందరు మాత్రం మళ్లీ వజ్రాల వెతుకులాటకు వెళుతూనే ఉన్నారు. అధికారులు వెంటనే వజ్రాల బయట పడుతున్న విషయాలను గమనించి ప్రజలకు తగు సూచనలు చేయాలని పలువురు కోరుతున్నారు.


తక్కువ కేటగిరిలో ప్రజలకు దొరికిన వజ్రం

అభివృద్ధి, ఐకమత్యమే కోటయ్య ఆయుధాలు

- మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం


ప్రగడకోటయ్య జయంతి సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల, జూలై 26 : అభివృద్ధి, ఐకమత్యం అనే నినాదాలే ప్రజాబంధు ప్రగడ కోటయ్య నినాదాలని, ఆ స్ఫూర్తిని నేటితరం విస్మరిస్తోందని మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి అన్నారు. స్థానిక ప్రగడ కోటయ్య కాంస్య విగ్రహం వద్ద శుక్రవారం కోటయ్య జయంతిని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో బలరాం మాట్లాడుతూ స్వలాభాపేక్షతో వేస్తున్న అడుగులతో సత్ఫలితాలు దూరమవుతున్నాయన్నారు. మాచర్ల మోహనరావు, డాక్టర్ వరికూటి అమృతపాణి, అడుసుమల్లి వెంకట సుబ్బయ్య, దామర్ల శ్రీకృష్ణ, గవిని శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ ప్రగడ కోటయ్య రాష్ట్రంలోను, ప్రత్యేకంగా చీరాల నియోజకవర్గ అభివృద్ధికి తనదైన ముద్రవేశారన్నారు. ముందుగా కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రగడ కోటయ్య అభిమానులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వల్ప వాగ్వాదం...

ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య కుమారుడు డాక్టర్ మహేంద్ర నాథ్, పలువురు నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రజాబంధు ప్రగడ కోటయ్య విగ్రహానికి పూల మాలలువేసి నివాళులు అర్పించారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే బలరాం అనుచరులతో కలసి కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ క్రమంలో నిర్వాహకులు ముందు తమకు ప్రాధాన్యత ఇవ్వలేదని మహేంద్రనాథ్ వెంట వచ్చిన వారిలో ఒకరు ఒకింత పరుషంగా మాట్లాడటంతో ఇరువైపుల వ్యక్తుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఇదిలా ఉంటే కోటయ్యకు నివాళులు అర్పించే క్రమంలో బలరాం, కింద ఉన్న మహేంద్రనాథ్‌ను పైకి రమ్మని పిలవగా, పలకరింపుగా అభివాదం చేస్తూ అంకుల్ మీరు వేసి రండి, మేం తరువాత వేస్తామని చెప్పారు.


సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న పల్లెపాలెం మత్స్యకారులు

217 జీవో రద్దుపై హర్షం

చినగంజాం, జూలై 26 : వైసీపీ ప్రభుత్వంలో అమలు చేసిన జీవో నెంబరు 217ని టీడీపీ కూటమి ప్రభుత్వం రద్దు చేయడంపై మండల పరిధిలోని మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామంలో జీవోనెంబరు 217ని రద్దు చేయడంపై టీడీపీ బాపట్ల పార్లమెంట్ అగ్ని కుల క్షత్రియ కమిటీ సభ్యులు గొల్లపోతు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావుల చిత్రపటాలకు మత్స్యకారులు శుక్రవారం పాలాభిషేకం చేశారు. గత ప్రభుత్వం అమలు చేసిన జీ.వో 217 వలన రాష్ట్రంలో సుమారు 700 మత్స్యకార సహకార సంఘాలు, నాలుగు లక్షల మంది మత్స్యకారులకు నష్టం వాటిల్లిందని టీడీపీ పర్చూరు నియోజకవర్గ బీసీ సెల్ కార్యవర్గ సభ్యులు కొక్కిలిగడ్డ రామాంజనేయులు తెలిపారు. జీవో రద్దుతో 3,325 చిన్న తరహా సాగునీటి చెరువులు, 23,920 పంచాయతీ చెరువులు, 118 రిజర్వాయర్లు మత్స్యకార సొసైటీలకే దక్కనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 217 జీవోని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని, ఇచ్చినట్లుగానే రద్దు చేసి మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు మత్స్యకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పర్చూరు నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులు దండ్రుప్రోలు తిరుపతి రావు, జి.నాగేంద్రబాబు, అవనిగడ్డ వెంకటరావు, ఎ.నాగస్వాములు, జి.శరత్‌బాబు, వి.ఏసునాదం, కే.శ్రీను, మత్స్యకార మహిళలు పాల్గొన్నారు.

మూడు ద్విచక్రవాహనాలు దహనం

● గుర్తుతెలియని వ్యక్తులు చేసినట్లు అనుమానాలు


కాలిపోయిన వాహనాలను, వస్తువులను పరిశీలిస్తున్న సీఐ రాజశేఖర్

మార్టూరు, జూలై 26: మండలంలోని కోనంకి గ్రామంలో షేక్ ఖాజావలి అనే వ్యక్తి ఇంటిలో జరిగిన అగ్నిప్రమాదంలో మూడు ద్విచక్రవాహనాలు, ఒక సోడాబండి పూర్తిగా దహనమయ్యాయి. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది శుక్రవారం ఉదయం బాధితుని కుమారుడు షేక్ మస్తానవలి మార్టూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ రాజశేఖర్‌రెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. వివరాల్లోకి వెళితే.. ఖాజావలి కోనంకిలో సోడా బండిని నడుపుకుంటూ వ్యవసాయసీజన్‌లో బళ్లారి వెళ్లి వ్యవసాయం చేస్తుంటారు. ఇటీవల బళ్లారి వెళుతూ సోడాబండిని, తన ద్విచక్రవాహనాన్ని ఇంటి వరండాలో ఉంచాడు. అయితే ఈ ఇంటిలో ఖాజావలి కుటుంబం నివశించడం లేదు. ఇంటి ఎదురుగా ఉన్న మరో ఇంటిలో వారు ఉంటున్నారు. ఆ ఇంటి వరండాలో అతని బంధువులకు చెందిన మరో రెండు ద్విచక్రవాహనాలు కూడా ఉంచారు. దాంతో గుర్తుతెలియని వ్యక్తులు మూడు ద్విచక్రవాహనాలను, సోడాబండిని దహనం చేశారు.అనంతరం ఈ మంటలు వ్యాపించి ఇంటి కరెంటు మీటరు, వైర్లతో పాటు ఇంటిలోపల బీరువా, దుస్తులు కూడా కాలిపోయాయి. అయితే పెద్దగా శబ్దాలు రావడం, మంటలు వ్యాపించడంతో ఇంటి ఎదురుగా మరో ఇంటిలో నివసిస్తున్న ఖాజావలి కుమారుడు మస్తానవలి ఇంటినుంచి బయటకు వచ్చి సమీపంలోని బంధువులను పిలిపించి మంటలను ఆర్పివేయించాడు.కాని అప్పటికే పూర్తిగా నష్టం జరిగింది.ఈ ప్రమాదం కాకుండా సమీపంలోని మరో ఇంటిముందు ఉన్న స్కూటీని,ఇంటిలోని సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకు పోయారు.వారు దొంగతనం చేసి వెళుతూ ఈ అగ్నిప్రమాదం చేసి ఉంటారని షేక్ మస్తానవలి అనుమానంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి బాపట్ల నుంచి క్లూస్‌టీం బృందం రాగా వారు వేలిముద్రలను సేకరించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పత్తిలో గులాబి పురుగు నివారణపై అవగాహన

ఇంకొల్లు, జూలై 26: మండలంలోని ఇడుపులపాడులో పత్తి పంటను బాపట్ల జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ పరిశీలించారు. పత్తి, నవధాన్యాల పంటల సాగులో మెలకువలు రైతులకు వివరించారు. పత్తిలో గులాబి పురుగును అరికట్టేందుకు 20 రోజుల నుంచి వేపకషాయం పిచికారీ చేయడంతో పాటు లింగాకర్షణ బుట్టలను పెట్టుకోవాలని సూచించారు. కౌలురైతులు తప్పకుండా కౌలుదారు కార్డులను పొందాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు రాయితీలో వ్యవసాయ పనిముట్లు, సూక్ష్మపోషకాలైన జింకు, జిప్సం, బోరాన్‌లు అందజేయాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న ఆటో

నలుగురికి గాయాలు

పంగులూరు, జూలై 26 : ముందు వెళుతున్న బైక్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. మండలంలోని బైటమంజులూరు సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. హైవే అంబులెన్స్ సిబ్బంది అందించిన సమాచారం మేరకు గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం తాళ్లూరుకు చెందిన ఆటో డ్రైవర్ టి. మణికంఠ తన ఆటోతో గుంటూరు నుంచి మేదరమెట్ల బయలుదేరాడు. బైటమంజులూరు సమీపంలో ముందు వెళుతున్న బైకును ఢీకొని ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న మేడికొండూరుకు చెందిన శివపార్వతి అనే మహిళకు తీవ్ర రక్త గాయాలు కాగా బైకుపై వెళుతున్న ముప్పవరం గ్రామానికి చెందిన పూర్ణారావు, జనకవరం గ్రామానికి చెందిన కుంచాల మహేష్, కుంచాల శివకృష్ణలకు గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పెనుగంచిప్రోలులో మొక్కు తీర్చుకున్న టీడీపీ నేతలు


పెనుగంచిప్రోలులో మొక్కు తీర్చుకుంటున్న అద్దంకి పట్టణ టీడీపీ నేతలు

అద్దంకి, జూలై26 : టీడీపీ కూటమి అధికారంలోకి రావటం, గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో అద్దంకి పట్టణ టీడీపీ నేతలు శుక్రవారం పెనుగంచి ప్రోలులో మొక్కు తీర్చుకున్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి కుందారపు రామారావు(చినరాముడు) ఆధ్వర్యంలో అద్దంకి పట్టణ టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పెనుగంచి ప్రోలు వెళ్లి లక్ష్మీతిరుపతమ్మను దర్శించుకొని మొక్కు తీర్చుకున్నారు.

విద్యార్థులు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

అద్దంకి, జూలై26: విద్యార్థులు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది రఫీ అన్నారు. అద్దంకి పట్టణంలోని ఎన్‌టీఆర్ డి గ్రీ కళాశాలలో శుక్రవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల అక్రమ వినియోగం, ర్యాగింగ్‌కు పాల్పడితే పడే శిక్షలు , హెల్మెట్ వినియోగించాల్సిన ఆవశ్యకత గురించి న్యాయవాదులు షేక్ మహ్మద్ రఫీ, టి. మార్త శ్రీనివాస్, ప్రకాష్, గృహలక్ష్మిలు వివరించారు. కరస్పాండెంట్ రత్తయ్య, ప్రిన్సిపాల్ పెద్ద రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయవాది రఫీ

క్యాజువాల్టీలో బెడ్‌పై మందుబాబు

● బిత్తరపోయిన ఆసుపత్రి సిబ్బంది


మద్యం మత్తులో బెడ్‌పై ఉన్న మందుబాబు

చీరాలటౌన్ జూలై 26 : 'బయట ఎండ ఎక్కువగా ఉంది. ఉక్క పోస్తుంది. ఏరియా హాస్పిటల్‌లో చల్లగా ఉంటుంది. కాసేపు పడుకుని రెస్ట్ తీసుకుందామని పించింది. ఆ మందుబాబుకి.. ఇంకేముంది క్వార్టర్ మందు వేసి ప్రభుత్వ ఆసుపత్రిలోని క్యాజువాలిటీలో బెడ్‌పై పడుకొని మత్తు నిద్రలోకి జారుకున్నాడు. ఆసుపత్రి సిబ్బంది వచ్చి లేపడంతో అసహనం వ్యక్తం చేశాడు. ఈఘటన చీరాల ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం వెలుగుచూసింది. స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన దానియేలు కుటుంబ సమస్యలతో మద్యానికి బానిసగా మారాడు.శుక్రవారం మద్యం బాగా పట్టించాడు. ఆతరువాత చీరాల ఏరియా హాస్పిటల్‌లో బెడ్‌లు బాగుంటాయి. పైగా చుట్టూ చెట్లతో చల్లగా ఉంటుందని భావించాడు. ఈక్రమంలోనే ఊగుకుంటూ హాస్పిటల్‌లో క్యాజువాల్టీకి వచ్చాడు. అప్పటికే హాస్పిటల్ సిబ్బంది ఓ యాక్సిడెంట్ కేసుకు సంబంధించిన వారికి వైద్యం అందిస్తూ బిజీగా ఉన్నారు. దీంతో అతనే మంచి బెడ్ చూసుకున్నాడు. నేరుగా ఫ్యాన్ వేసుకుని పవళించాడు. ఇతని బెడ్ వద్దకు వచ్చాక ఆరోగ్య సిబ్బంది లేపి బాబు ఏమిటి మీ సమస్య అని అడిగారు. మందు వేశాను. కాసేపు పడుకుంటానని నిద్ర మత్తులో చెప్పాడు. బిత్తర పోయిన సిబ్బంది సెక్యూరిటీ సహాయంతో బయటకు పంపించారు. ఇదంతా గమనించిన ఆంధ్రజ్యోతి ఆ సన్నివేశాలను కెమెరాలో బంధించింది.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి


స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్

అద్దంకి, జూలై26: సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించటం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. అద్దంకి పట్టణం 8 వ వార్డు పరిధిలోని నర్రావారిపాలెం, రామకృష్ణాపురం, శ్రీరామ్‌నగర్ కాలనీ, గొర్లమిట్టలలో శుక్రవారం కమిషనర్ సత్యనారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా సైడ్ డ్రైన్‌లు, తాగునీటి సమస్య, శానిటేషన్, కుక్కల బెడద తదితర సమస్యలను స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకు వచ్చారు. టీడీపీ నేతలు దొప్పలపూడి ప్రసాద్, నర్రా రవీంద్రనాథ్, బిళ్ళపాటి రామాంజనేయులు, నర్రా సుబ్బారావు, శివకృష్ణ, బొజ్జా విజయ్‌కుమార్, యద్దనపూడి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

టీడీఆర్ బాండ్లలో అక్రమాలపై నిగ్గుతేల్చాలి


శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 26 : వైసీపీ ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన టీడీఆర్(ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్) బాండ్ల అక్రమాలపై నిగ్గు తేల్చాలని గురువారం అసెంబ్లీ సమావేశ ప్రశ్నోత్తరాల సమయంలో చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య కోరారు. గత ప్రభుత్వ హయాంలో ప్రధానంగా చీరాల, ఒంగోలు, బాపట్లకు సంబంధించి విడుదల చేసిన టీడీఆర్ బాండ్ల వివరాలు వెల్లడించాలన్నారు. జరిగిన అక్రమాలపై చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత


క్రీడాసామగ్రి అందిస్తున్న బీవోబీ అధికారులు

బల్లికురవ. జూలై 26 : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో ఉన్న బ్యాంకు అఫ్ బరోడా శాఖ తరఫున అగ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం క్రీడా సామగ్రిని అందజేశారు. ఈసందర్భంగా బ్యాంకు మేనేజర్ దన్‌పాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అవసరాలకు తమ బ్యాంకు తరఫున చేయూత ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఈవో


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో

స్వర్ణ(పర్చూరు), జూలై 26: కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో మొలబంటి వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలోని విద్యార్థుల హాజరు, స్కూల్ రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించే విధంగా చర్యలు తీసుకోవాని హెచ్‌ఎం సుబ్బారావుకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వసతులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.

అమ్మవారికి ఆషాడమాస ప్రత్యేక పూజలు


ఆషాడమాస పూజల్లో పాల్గొన్న మహిళలు

ఇంకొల్లు,జూలై 26 : భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ఇంకొల్లు పద్మాలంకమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం భక్తులు సంప్రదాయబద్ధంగా ఆషాడమాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సారెను సమర్పించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు లలితా సహస్రనామ పారాయణం చేశారు. అధికసంఖ్యలో మహిళలు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కన్యకాపరమేశ్వరి అమ్మ వారికి ఆషాడం సారె


కన్యకాపరమేశ్వరి అమ్మవారికి సారె సమర్పిస్తున్న వాసవి వనిత క్లబ్ సభ్యులు

చినగంజాం, జూలై 26 : పెనుగొండ క్షేత్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి చినగంజాం మండల వాసవి వనితా క్లబ్ సభ్యులు ఆషాడ మాసపు సారె కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వాసవి వనితా క్లబ్ మండల అధ్యక్షురాలు కోట సుచిత్ర ఆధ్వర్యంలో సభ్యురాలు తమ కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకొని, విశేష పూజలు నిర్వహించి, అమ్మవారికి సారె సమర్పంచి మొక్కులు తీర్చుకున్నారు. చినగంజాం మండల ఆర్యవైశ్య కమిటీ అధ్యక్షులు కోట శివరామకృష్ణ, వాసవి వనిత క్లబ్ జెడ్.సీ పొట్టి శైలజ, మండల కార్యదర్శి భయ్యా జ్యోతి, కోశాధికారి మోటుమర్రి శేషుకుమారి, క్లబ్ సభ్యురాలు, కుటుంబసభ్యులు సారె కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పర్చూరు, జూలై 26: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ మేకా ఆనందకుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో బి.శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.